PRGI Reg No -“APTEL/26/A1193

నేటి
# శుభోదయ
ప్రతి క్షణం - ప్రజల కోసం
తెలుగు దినపత్రిక

చదవండి..... చదివించండి....

ప్రతిక్షణం... ప్రజల కోసం...
www.netishubhodaya.com
96965 71571


ప్రచురణ : ఆంధ్రప్రదేశ్, సంపుటి 01, సంచిక 83, సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు, పేజీలు -8, గురువారం - 14 - మే - 2026, వెల రూ.5/-

## దేశంలోనే తొలి క్వాంటం కంప్యూటర్
# ఏపీలో ఏర్పాటు చేస్తాం
### అమరావతితో పాటు విశాఖ, రాయలసీమ సమగ్ర అభివృద్ధికి ప్రణాళికలు వెల్లడి

- ★అమరావతిలో భారీ మెడికల్ ప్రాజెక్టు.. బొల్లినేని కాలేజీకి సీఎం చంద్రబాబు శంకుస్థాపన
- ★అమరావతి నిడమర్రులో బొల్లినేని మెడికల్ కాలేజీకి సీఎం చంద్రబాబు శంకుస్థాపన
- ★లక్ష మందికి నైపుణ్య శిక్షణ అందించి గ్లోబల్ మెడికల్ హబ్‌గా మార్చడమే లక్ష్యం
- ★గడువులోగా ప్రాజెక్టులు పూర్తి చేయాలని పారిశ్రామికవేత్తలకు స్పష్టమైన ఆదేశాలు



అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిని ప్రపంచస్థాయి వైద్య, నైపుణ్యాభివృద్ధి కేంద్రంగా తీర్చిదిద్దే బృహత్ ప్రణాళికకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా, నిడమర్రులో “బొల్లినేని ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్కిల్, ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్” (బొల్లినేని మెడికల్ కాలేజీ అండ్ స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ) నిర్మాణానికి ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎంపీ గంటి హరీష్, రాష్ట్ర మంత్రి పయ్యావుల కేశవ్, మిగతా.. 2లో



## దేశంలోనే తెలంగాణలో
# అత్యధిక ద్రవ్యోల్బణం

- ●తెలంగాణలో 5.81 శాతం రిటైల్ ద్రవ్యోల్బణం
- ●దేశవ్యాప్తంగా 13 నెలల గరిష్ఠానికి చేరిన ధరల సూచీ
- ●ఆహార పదార్థాలు, బంగారం, వెండి ధరలు పెరగడమే ప్రధాన కారణం
- ●ఆంధ్రప్రదేశ్‌లో 4.2 శాతంగా నమోదైన రిటైల్ ద్రవ్యోల్బణం
- ●గత ఆరు నెలలుగా వరుసగా పెరుగుతున్న ధరలు

హైదరాబాద్: ఏప్రిల్ నెలలో ఎండలతో పాటు ధరలు కూడా భగ్గుమన్నాయి.

### రైతులకు గుడ్ న్యూస్.. పంటల మద్దతు ధరను
# పెంచుతూ కేంద్రం నిర్ణయం
### ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశం
### రైతుల సంక్షేమం, మౌలిక సదుపాయాల అభివృద్ధిపై కీలక నిర్ణయాలు
### క్వింటాల్ వరికి రూ. 2,441గా మద్దతు ధర

ఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో తీసుకున్న నిర్ణయం దేశవ్యాప్తంగా ఉన్న రైతాంగానికి భారీ ఊరటనిచ్చింది. రాబోయే ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని రైతుల సంక్షేమం, మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది. మిగతా.. 2లో





# మిషన్ మోడ్‌లో పనిచేసి సేకరణ పూర్తి చేయాలి

- ➤క్షేత్రస్థాయిలో ధాన్యం, మక్కల కొనుగోళ్ల తీరును పరిశీలించాలి
- ➤ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తేనే సమస్యలు పరిష్కారమవుతాయి
- ➤లారీలు అందుబాటులో ఉంచని కాంట్రాక్టర్లపై క్రిమినల్ కేసులు పెట్టండి
- ➤కలెక్టర్లపైనా చర్యలకు వెనుకాడం

హైదరాబాద్: రాష్ట్రంలో ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్ల ప్రక్రియను మిషన్ మోడ్‌లో పనిచేసి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్లను ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి కొనుగోళ్ల తీరును పరిశీలించాలని సూచించారు. సమస్య తీవ్రతను గుర్తించి జిల్లా కలెక్టర్లు సరైన మిగతా.. 2లో

## ఈ ప్రభుత్వం ఎంతకాలం పనిచేస్తుందో!
### అసెంబ్లీలో ఉదయనిధి స్టాలిన్ ఆసక్తికర వ్యాఖ్యలు



విశ్వాస పరీక్షలో నెగ్గిన విజయ్ ప్రభుత్వం
చర్చ సందర్భంగా ప్రభుత్వం మనుగడపై ఉదయనిధి అనుమానాలు
ప్రభుత్వానికి ఓటు వేసినందుకు ప్రజలు పశ్చాత్తాపపడుతున్నారని వ్యాఖ్య

### కుమారుడి నేరం రుజువైతే బండి సంజయ్
# పదవికి రాజీనామా చేయాలి
### బండి సంజయ్ కుమారుడు దేశం దాటి పోకుండా లుకౌట్ నోటీసులు జారీ చేయాలి

- ▶మోదీతో బండి సంజయ్ వేదికను పంచుకోవడం తప్పుడు సంకేతాలు పంపింది
- ▶తెలంగాణలో రాజకీయ శూన్యతను భర్తీ చేసేందుకే తమ పార్టీ పుట్టిందన్న కవిత



హైదరాబాద్: కేంద్ర మంత్రి బండి సంజయ్ కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కవిత విమర్శనాస్త్రాలు మిగతా.. 2లో

## ప్రపంచ స్థాయి బ్రాండ్లు ఏపీ నుంచే తయారవుతున్నాయి
### ఇప్పుడు ఆ బ్రాండ్లన్నీ ఏపీ నుంచే

- ▸'మేడ్ ఇన్ ఏపీ'పై మంత్రి నారా లోకేష్ ఆసక్తికర ట్వీట్
- ▸రాష్ట్రంలో తయారీ రంగంపై ఓ ప్రత్యేక వీడియో విడుదల
- ▸ప్రపంచ స్థాయి మౌలిక వసతులే ఇందుకు కారణమన్న లోకేష్




అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో తయారీ రంగం దూసుకెళు తోందని, 'మేడ్ ఇన్ ఆంధ్రప్రదేశ్' అనేది ఇప్పుడు నమ్మకానికి మారుతోందని నాణ్యతకు, చిహ్నంగా మిగతా.. 2లో

### విదేశీ పర్యటనలు, బంగారం
## కొనుగోళ్లు తగ్గించుకోవాలి



మోదీ కీలక నిర్ణయం.. కాన్వాయ్ తగ్గించుకున్న ప్రధాని
పొదుపు చర్యల్లో భాగంగా కాన్వాయ్ తగ్గించుకున్న ప్రధాని మోదీ
కొత్తవి కొనకుండా ఎలక్ట్రిక్ వాహనాలు పెంచాలని ఎస్పీజీకి సూచన

### ఐఆర్జీసీని టార్గెట్ చేసిన అమెరికా...
## రూ.145 కోట్ల బంపర్ బొనాంజా ప్రకటన



అమెరికా, ఇరాన్ మధ్య ఆలస్యమవుతున్న శాంతి ఒప్పందం
ఈ క్రమంలో ఐఆర్‌జీసీకి సంబంధించి అమెరికా ఆఫర్
గల్ఫ్ దేశాలపై దాడులు చేయకుండా, అణు కార్యక్రమాలు చేపట్టకుండా దెబ్బతీయడమే లక్ష్యమని వెల్లడి




## ఆంధ్రప్రదేశ్‌కు 10, తెలంగాణకు 23 టీఎంసీలు

- ▶▶వేసవిలో తాగునీటి కోసం రెండు రాష్ట్రాలకు కేటాయింపు
- ▶▶కృష్ణా బోర్డు త్రిసభ్య కమిటీ సమావేశంలో నిర్ణయం
- ▶▶ వేసవి తాగునీటి అసవరాల కోసం ఇరు రాష్ట్రాలు చేసిన విజ్ఞప్తులపై భేటీ

హైదరాబాద్: శ్రీశైలం జలాశయంలో కనీస నిల్వమట్టానికి (ఎండీడీఎల్) ఎగువన మిగిలి ఉన్న 5.27 టీఎంసీల జలాలను పూర్తిగా మిగతా.. 2లో

## ఇది కొత్త రియాలిటీ...
# దీన్ని ప్రోత్సహిద్దాం
### వర్క్ ఫ్రం హోమ్ విధానాన్ని ప్రోత్సహించాలని సీఎం చంద్రబాబు పిలుపు

- ★పశ్చిమ ఆసియా యుద్ధ నేపథ్యంలో ప్రధాని 8 సూచనలను పాటిద్దామన్న ముఖ్యమంత్రి
- ★పెట్రోల్ వాడకం, విదేశీ పర్యటనలు తగ్గించుకుని దుబారాకు అడ్డుకట్ట వేయాలని సూచన
- ★అమరావతిలో బైసర్ ఇనిస్టిట్యూట్, కిమ్స్ ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన
- ★క్వాంటమ్ వ్యాలీతో అమరావతి నుంచి ప్రపంచానికి కంప్యూటర్లు అందిస్తామన్న సీఎం



అమరావతి: ఇంటి నుంచే ప్రపంచం మొత్తం పనిచేసే పరిస్థితి వస్తోందని, ఈ నూతన వాస్తవికతను అందరూ ప్రోత్సహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ప్రభుత్వంలోనూ భవిష్యత్తులో ఈ తరహా విధానాన్ని అమలు చేసే అవకాశాలు వస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. మిగతా.. 2లో



## రాసి పెట్టుకోండి.. ధూళిపాళ్ల ఓడిపోవడం ఖాయం
### అంబటి రాంబాబు

- ●చలో మామిళ్లపల్లి కార్యక్రమంలో ధూళిపాళ్లపై అంబటి ఫైర్
- ●రైతుల ఇళ్లు, గోడౌన్లపై దాడి చేయించడం ఏమిటని ప్రశ్న
- ●లోకేశ్, పెమ్మసాని ఏం చెబితే ఐజీ అది చేస్తున్నారని విమర్శ

అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో గుంటూరు జిల్లా పొన్నూరు నియోజకవర్గ

## విదేశీ పర్యటనలు, బంగారం కొనుగోళ్లు తగ్గించుకోవాలి

ఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ పొదుపు, ఇంధన పరిరక్షణ దిశగా కీలక నిర్ణయం తీసుకున్నారు. తన కాన్వాయ్‌లోని వాహనాల సంఖ్యను తగ్గించాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ వ్యయాన్ని తగ్గించడంతో పాటు ప్రస్తుత ప్రపంచ పరిస్థితుల్లో ఇంధన వినియోగాన్ని పరిమితం చేయాలనే ఉద్దేశంతో ఈ చర్యలు చేపట్టారు. తన భద్రతా బాధ్యతలు చూసే స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్ (ఎస్పీజీ)ను ఉద్దేశించి, కాన్వాయ్‌లో ఎలక్ట్రిక్ వాహనాల సంఖ్యను పెంచాలని, అయితే దీనికోసం కొత్త వాహనాలు కొనుగోలు చేయవద్దని స్పష్టంగా సూచించారు. భద్రతా ప్రమాణాలైన 'బ్లూ బుక్' మార్గదర్శకాలకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఎస్పీజీ ఈ ఆదేశాలను అమలు చేయడం ప్రారంభించింది. ప్రధాని తీసుకున్న ఈ నిర్ణయం స్ఫూర్తితో బీజేపీ పాలిత రాష్ట్రాలు కూడా అదే బాటలో పయనిస్తున్నాయి. ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా, రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్ లాల్ శర్మ, మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ వంటి వారు కూడా తమ అధికారిక కాన్వాయ్‌లలో వాహనాల సంఖ్యను తగ్గించుకోవాలని నిర్ణయించారు. ఇది దేశవ్యాప్తంగా పరిపాలనలో పొదుపును ప్రోత్సహించే విస్తృత ప్రయత్నాలలో భాగంగా కనిపిస్తోంది. ప్రభుత్వ స్థాయిలో పొదుపు చర్యలు చేపడుతూనే, ప్రజలు కూడా బాధ్యతాయుతంగా ఉండాలని ప్రధాని మోదీ ఇటీవల పిలుపునిచ్చారు. అమెరికా-ఇరాన్ యుద్ధం కారణంగా పెరిగిన ముడి చమురు ధరలు, ప్రపంచ ఆర్థిక అనిశ్చితి, ద్రవ్యోల్బణం వంటి సవాళ్లను ఎదుర్కోవడానికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. "ప్రతిదానికీ దిగుమతులపై ఆధారపడితే దేశం ఎలా అభివృద్ధి చెందుతుంది?" అని ప్రశ్నిస్తూ, స్థానిక ఉత్పత్తుల వాడకాన్ని ప్రోత్సహించాలని కోరారు. అంతేగాక ప్రజలు తమ జీవనశైలిలో బాధ్యతాయుతమైన మార్పులు చేసుకోవాలని ప్రధాని సూచించారు. విదేశీ మారక నిల్వలను కాపాడుకోవడం కూడా దేశభక్తితో సమానమని చెబుతూ, ప్రజలు ఏడాది పాటు అనవసరమైన బంగారం కొనుగోళ్లు, విదేశీ ప్రయాణాలు, విదేశాల్లో డెస్టినేషన్ వెడ్డింగ్‌లు వంటివి వాయిదా వేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీనికి బదులుగా దేశీయ పర్యాటకాన్ని ప్రోత్సహించాలని, వేడుకలను దేశంలోనే జరుపుకోవాలని ఆయన కోరారు.

## ఈ ప్రభుత్వం ఎంతకాలం పనిచేస్తుందో!

తమిళనాడు : తమిళనాడు నూతన ముఖ్యమంత్రిగా ఎన్నికైన టీవీకే అధినేత విజయ్ అసెంబ్లీలో తన బలాన్ని నిరూపించుకున్నారు. బుధవారం జరిగిన బలపరీక్షలో స్పష్టమైన మెజారిటీతో విజయ్ ప్రభుత్వం నెగ్గింది. విశ్వాస పరీక్షకు ఓటింగ్ సందర్భంగా డీఎంకే సభ నుంచి వాకౌట్ చేసింది. విశ్వాస పరీక్ష సందర్భంగా ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్ సభలో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కొత్త ప్రభుత్వాన్ని ఉద్దేశించి, ఈ ప్రభుత్వం ఎంతకాలం మనుగడ సాగిస్తుందోనని రాష్ట్ర ప్రజలు ప్రశ్నిస్తున్నారని వ్యాఖ్యానించారు. ఎంతకాలం మనుగడ సాగిస్తుందో తెలియని ప్రభుత్వానికి ఓటు వేసినందుకు ప్రజలు పశ్చాత్తాపపడుతున్నారని అన్నారు. తమిళనాడులో లౌకికవాద ప్రభుత్వమే ఉండాలని ఆకాంక్షించారు. ఎన్నికల్లో రాష్ట్రంలోని దాదాపు 65 శాతం మంది ఓటర్లు ముఖ్యమంత్రి విజయ్, టీవీకేను తిరస్కరించారని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మిత్రపక్షాలతో కలిసి అధికారంలోకి వచ్చారని, కనీసం ఇప్పుడైనా ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునే రీతిలో పనిచేయాలని సూచించారు. ఎందుకంటే మీకు ఓటు వేసిన ప్రజలే ఇప్పుడు పశ్చాత్తాపపడుతున్నారని అన్నారు. ఈ ప్రభుత్వం ఎంతకాలం కొనసాగుతుందోనని ప్రజల్లో అనుమానాలు నెలకొన్నాయని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కొత్త ప్రభుత్వానికి సూచించారు. విశ్వాస ఓటింగ్‌లో తమ పార్టీ పాల్గొనడం లేదని, డీఎంకే ఎమ్మెల్యేలం వాకౌట్ చేస్తున్నామని ఉదయనిధి స్టాలిన్ తెలిపారు. డీఎంకేతో పాటు మిత్రపక్షమైన ఎంఎంకే కూడా విశ్వాస పరీక్షను వ్యతిరేకించింది. మంత్రివర్గంలో ముస్లింలకు ప్రాతినిధ్యం లేకపోవడాన్ని ఆ పార్టీ నాయకుడు జవహిరుల్లా ప్రస్తావించారు. డీఎంకే మరో మిత్రపక్షం ఎంజేకే ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేసింది. విజయ్ నేతృత్వంలోని టీవీకే ప్రభుత్వానికి కాంగ్రెస్, వామపక్షాలు, వీసీకే, ఐయూఎంఎల్ మద్దతు ప్రకటించాయి. ఏఎంఎంకే పార్టీకి చెందిన ఏకైక ఎమ్మెల్యే ఎస్. కామరాజ్ కూడా ప్రభుత్వానికి మద్దతు పలికారు. దీంతో ఆయనను ఏఎంఎంకే పార్టీ నుంచి బహిష్కరించారు.

## ఐఆర్జీసీని టార్గెట్ చేసిన అమెరికా... రూ.145 కోట్ల బంపర్ బొనాంజా ప్రకటన

ఢిల్లీ: ఇరాన్ ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) ఆర్థిక మూలాల గురించి సమాచారం ఇచ్చిన వారికి 15 మిలియన్ డాలర్ల బహుమతిని ఇస్తామని అమెరికా విదేశాంగ శాఖ భారీ ఆఫర్ ఇచ్చింది. ఇది మన కరెన్సీలో సుమారు రూ.145 కోట్లు ఉంటుంది. యుద్ధాన్ని ముగించడానికి అమెరికా, ఇరాన్ తీసుకుంటున్న చర్యల్లో పురోగతి కనిపించడంలేదు. యుద్ధాన్ని ముగించడానికి వాషింగ్టన్ చేసిన ప్రతిపాదనలను టెహ్రాన్ అంగీకరించలేదు. దీంతో ఒప్పందం ఆలస్యమవుతోంది. ఈ క్రమంలో అమెరికా విదేశాంగ శాఖ భారీ ఆఫర్ ఇచ్చింది. ఐఆర్‌జీసీ, దాని సంబంధిత శాఖలకు కీలక ఆర్థిక వనరులను అందించే బినామీ కంపెనీలు, వ్యక్తులు, ఆర్థిక సంస్థల సమాచారాన్ని తమకు తెలియజేయాలని కోరింది. గల్ఫ్ దేశాలపై దాడులు చేయకుండా, అణు కార్యక్రమాలు చేపట్టకుండా ఇరాన్‌ను దెబ్బతీయడమే లక్ష్యమని స్పష్టం చేసింది. మరోవైపు, యుద్ధాన్ని ముగించేందుకు అవసరమైన ప్రతి అవకాశాన్ని తాము వినియోగించుకోవడానికి సిద్ధంగా ఉన్నామని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ బఘేర్ ఘలీబాఫ్ పేర్కొన్నారు. అదే సమయంలో ఏ విధమైన దురాక్రమణకైనా తగిన గుణపాఠం చెప్పేందుకు తమ సాయుధ దళాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. తప్పుడు అంచనాలు, తప్పుడు నిర్ణయాలు ఎల్లప్పుడూ తప్పుడు ఫలితాలనే ఇస్తుందని అన్నారు. చర్చల్లో భాగంగా తమ ప్రతిపాదనలను అమెరికా అంగీకరించాల్సిందేనని, మరో మార్గం లేదని స్పష్టం చేశారు.

## రాసి పెట్టుకోండి.. ధూళిపాళ్ల ఓడిపోవడం ఖాయం అంబటి రాంబాబు

అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో గుంటూరు జిల్లా పొన్నూరు నియోజకవర్గ పరిధిలోని మామిళ్లపల్లి ఘటన ఇప్పుడు పెను దుమారం రేపుతోంది. మొక్కజొన్న రైతులపై దాడులు జరిగాయని, అక్రమ కేసులు పెట్టారంటూ వైసీపీ చేపట్టిన 'చలో మామిళ్లపల్లి' కార్యక్రమంలో మాజీ మంత్రి అంబటి రాంబాబు... ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రపై విరుచుకుపడ్డారు. రైతుల ఇళ్లు, గోడౌన్లపై దాడులు చేయించడం ఏంటని అంబటి ప్రశ్నించారు. ప్రశ్నించే వారిపైనే దాడులు చేస్తారా అంటూ మండిపడ్డారు. "వచ్చే ఎన్నికల్లో ధూళిపాళ్ల నరేంద్ర ఓడిపోవడం ఖాయం, ఇది రాసుకోండి" అంటూ మూడేళ్ల ముందే ఆయన జోస్యం చెప్పారు. రైతుల కాలి ధూళికి ఆయన కొట్టుకుపోతారని వ్యాఖ్యానించారు. మా కుటుంబంపై, మా కులంపై , మా పార్టీపై కక్ష కట్టి ఇలాంటి దాడులు చేస్తున్నారా అని అంబటి నిలదీశారు. గుంటూరు ఐజీ త్రిపాఠి ఖాకీ డ్రెస్ వేసుకోవడం లేదని, పచ్చ డ్రెస్ (టీడీపీ రంగు) వేసుకుంటున్నారని ఆరోపించారు. లోకేశ్, పెమ్మసాని ఏం చెబితే ఐజీ అది చేస్తున్నారని విమర్శించారు. తప్పు చేస్తే ఎంతటి పెద్ద అధికారినైనా చట్టప్రకారం శిక్షిస్తామని, తప్పుడు కేసులు వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. గోడౌన్‌లో సీజ్ చేసిన మొక్కజొన్నను వెంటనే విడుదల చేయాలని కోరారు. అరెస్టులకు భయపడేది లేదని, అవసరమైతే జైలుకు వెళ్లడానికైనా సిద్ధమని అంబటి రాంబాబు స్పష్టం చేశారు.

## దేశంలోనే తెలంగాణలో అత్యధిక ద్రవ్యోల్బణం

హైదరాబాద్: ఏప్రిల్ నెలలో ఎండలతో పాటు ధరలు కూడా భగ్గుమన్నాయి. దేశవ్యాప్తంగా ధరలు పెరిగినా, ఆ సెగ తెలంగాణకు ఎక్కువగా తగిలింది. దేశంలోనే అత్యధికంగా 5.81 శాతం రిటైల్ ద్రవ్యోల్బణం తెలంగాణలోనే నమోదైంది. పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో ఇది 4.2 శాతంగా ఉంది. మంగళవారం కేంద్ర గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్ఓ) విడుదల చేసిన నివేదిక ఈ వివరాలను వెల్లడించింది. దేశవ్యాప్తంగా వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ) ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం ఏప్రిల్‌లో 3.48 శాతానికి చేరింది. ఇది గత 13 నెలల్లోనే అత్యధిక స్థాయి కావడం గమనార్హం. గత ఆరు నెలలుగా ద్రవ్యోల్బణం వరుసగా పెరుగుతూ వస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. మార్చిలో 3.40 శాతంగా ఉన్న ద్రవ్యోల్బణం, నెల రోజుల వ్యవధిలోనే గణనీయంగా పెరిగింది. కూరగాయలు, ఇతర ఆహార పదార్థాలతో పాటు బంగారం, వెండి ధరలు పెరగడమే ఇందుకు ప్రధాన కారణంగా నిలిచింది. ఆహార వస్తువుల ద్రవ్యోల్బణం మార్చిలో 3.87 శాతం ఉండగా, ఏప్రిల్‌లో 4.20 శాతానికి పెరిగింది. ముఖ్యంగా టమాటా (35.28%), కాలీఫ్లవర్ (25.58%), కొబ్బరి (44.55%) ధరలు భారీగా పెరిగాయి. మరోవైపు, బంగారం, వజ్రాభరణాల ధరలు 40.72 శాతం పెరగగా, వెండి ఆభరణాల ధరలు ఏకంగా 144.34 శాతం పెరిగాయి. అయితే బంగాళదుంపలు, ఉల్లిపాయల వంటి కొన్నింటి ధరలు తగ్గాయి. రాష్ట్రాల వారీగా చూస్తే మిజోరాంలో అత్యల్పంగా 0.69 శాతం ద్రవ్యోల్బణం నమోదైంది.

## ఆంధ్రప్రదేశ్‌కు 10, తెలంగాణకు 23 టీఎంసీలు

హైదరాబాద్: శ్రీశైలం జలాశయంలో కనీస నిల్వమట్టానికి (ఎండీడీఎల్) ఎగువన మిగిలి ఉన్న 5.27 టీఎంసీల జలాలను పూర్తిగా తెలంగాణ రాష్ట్రానికి కేటాయించాలని కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) త్రిసభ్య కమిటీ నిర్ణయించింది. నాగార్జునసాగర్ జలాశయంలో ఎండీడీఎల్‌కి ఎగువన 28.21 టీఎంసీల నిల్వలు మిగిలి ఉండగా, ఏపీ తాగునీటి అవసరాలకు కుడి కాల్వ ద్వారా 10 టీఎంసీలను విడుదల చేయాలని నిర్ణయించింది. మిగిలిన 18.21 టీఎంసీలను సాగర్ ఎడమ కాల్వ ద్వారా తెలంగాణకు విడుదల చేయాలని నిర్ణయించింది. మొత్తంగా ఏపీకి 10 టీఎంసీలు, తెలంగాణకు 23.48 టీఎంసీల జలాలను త్రిసభ్య కమిటీ కేటాయించింది. కృష్ణా బోర్డు సభ్య కార్యదర్శి సతీష్ కంబోజ్ అధ్యక్షతన జలసౌధలో త్రిసభ్య కమిటీ సమావేశం జరిగింది. వేసవి తాగునీటి అసవరాల కోసం ఇరు రాష్ట్రాలు చేసిన విజ్ఞప్తులపై ఈ భేటీలో చర్చించారు.

వేసవి అవసరాలకు విన్నపాలు: మే 31 నాటికి ఉండనున్న తమ రాష్ట్ర తాగునీటి అవసరాల కోసం నాగార్జునసాగర్ నుంచి కుడి కాల్వకు 10 టీఎంసీల జలాలను విడుదల చేయాలని గతంలో కృష్ణా బోర్డుకు ఏపీ విజ్ఞప్తి చేసింది. మరోవైపు మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లాల తాగునీటి అవసరాల కోసం శ్రీశైలం నుంచి 5 టీఎంసీలు, హైదరాబాద్ నగరం, నల్లగొండ, సూర్యాపేట, ఖమ్మం జిల్లాల తాగునీటి అవసరాల కోసం నాగార్జునసాగర్ నుంచి 13 టీఎంసీలు.. మొత్తంగా 18 టీఎంసీల జలాలను జూలై చివరి నాటికి వాడుకుంటామని తెలంగాణ విజ్ఞప్తి చేసింది. కాగా ఏపీ విజ్ఞప్తిపై మంగళవారం నాటి భేటీలో తెలంగాణ అభ్యంతరం వ్యక్తం చేసింది. ప్రస్తుత నీటి సంవత్సరంలో 1112.66 టీఎంసీల కృష్ణా జలాలు లభ్యతలోకి ఉండగా, ఏపీ ఇప్పటికే ఏకంగా 771.25 టీఎంసీలు (74.23శాతం) వాడుకుందని కమిటీ దృష్టికి తెచ్చింది. అయితే వేసవి దృష్ట్యా తాగునీటి అవసరాలకు తొలి ప్రాధాన్యతనిస్తూ పరస్పరం సహకరించుకోవాలని కృష్ణా బోర్డు సభ్య కార్యదర్శి సూచించడంతో ఈ మేరకు కేటాయింపులకు రెండు రాష్ట్రాలు అంగీకరించాయి.

## మిషన్ మోడ్‌లో పనిచేసి సేకరణ పూర్తి చేయాలి



సమస్య తీవ్రతను గుర్తించి జిల్లా కలెక్టర్లు సరైన చర్యలు తీసుకోవాలని, ప్రతి అధికారి జవాబుదారీతనంతో వ్యవహరించాలని చెప్పారు. కలెక్టర్లు ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తేనే సమస్యలు పరిష్కారమవుతాయని, ఏ సమస్య వచ్చినా కలెక్టర్లు బాధ్యత తీసుకుని పరిష్కరించాలని స్పష్టం చేశారు. నిర్లక్ష్యం వహిస్తే కలెక్టర్లపై చర్యలకూ ప్రభుత్వం వెనకాడదని హెచ్చరించారు. మంగళవారం సీఎం క్యాంపు కార్యాలయంలో రాష్ట్రంలో ధాన్యం సేకరణ ప్రక్రియ, పురోగతిపై జిల్లా కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్ల విషయంలో తలెత్తిన ఇబ్బందులు, సమస్యలపై రేవంత్ ఆరా తీశారు. 'గన్నీ బ్యాగులు, హమాలీల కొరత లేకుండా చూసుకోవాలి. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు గోదాములకు తరలించాలి. రవాణా శాఖ కమిషనర్ ధాన్యం తరలింపునకు అవసరమైన వాహనాలు అందుబాటులో ఉండేలా చూడాలి. ఒప్పందం మేరకు సరిపడా లారీలను అందుబాటులో ఉంచని కాంట్రాక్టర్లపై క్రిమినల్ కేసులకూ వెనకాడొద్దు. అవసరమైతే స్థానికంగా ట్రాక్టర్లు, ఇతర వాహనాలను వినియోగించాలి. మొక్కజొన్న పంట ఎక్కువగా వచ్చే జిల్లాల కలెక్టర్లు కొనుగోళ్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలి. ఎక్కడా రైతులకు ఇబ్బందులు కలగకూడదు. ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్లపై కలెక్టర్లు ఎప్పటికప్పుడు సీఎస్‌కు నివేదికలు పంపాలి. సేకరించిన ధాన్యాన్ని నిల్వ చేసేందుకు మిల్లుల్లో స్థలం సరిపోవడం లేదని అంటున్నారు. చాలా ప్రాంతాల్లో గోదాముల సమస్య ఉన్నట్లు తెలుస్తోంది. అలాంటి ప్రాంతాల్లో అవసరాన్ని బట్టి తాత్కాలిక ఏర్పాట్లు చేసుకోవాలి. రైతుబజార్లు, ఫంక్షన్ హాళ్లను తీసుకుని ధాన్యాన్ని అక్కడికి తరలించాలి. తర్వాత పరిస్థితిని బట్టి గోడౌన్లకు తరలించేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి..'అని సీఎం ఆదేశించారు. 'అకాల వర్షాలతో రైతులు నష్టపోకుండా ఉండేందుకు శాశ్వత పరిష్కారం దిశగా కలెక్టర్లు ప్రణాళికలు సిద్ధం చేయాలి. కల్లాల వద్ద ధాన్యం తడవకుండా ఉండేందుకు అవసరమైన టార్పాలిన్లను రైతులకు అందుబాటులో ఉంచాలి. వాతావరణ శాఖ సూచనల ఆధారంగా ఎప్పటికప్పుడు రైతులను అప్రమత్తం చేసేందుకు మండల స్థాయిలో ఒక అధికారిని నియమించాలి. వాతావరణ సూచనలను రైతులకు చేరవేసేందుకు ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలి. ప్రతి ఐకేపీ సెంటర్‌కు ఒక అధికారిని నియమించి కొనుగోలు కేంద్రాల వద్ద సమస్యలు తలెత్తకుండా చూడాలి. ప్రతి రైస్ మిల్లు దగ్గర ఒక బాధ్యతాయుతమైన అధికారిని నియమించి పర్యవేక్షించాలి. ధాన్యం లోడింగ్‌లో జాప్యం జరగకుండా స్థానికంగా ఉన్న హమాలీలను గుర్తించి వారితో పని చేయించుకోవాలి. ధాన్యం లోడ్ చేసిన వెంటనే రైతులకు రశీదు ఇవ్వాలి. అలా చేస్తే తాలు, తరుగు పేరుతో అక్రమాలు జరగకుండా చూడొచ్చు..'అని ముఖ్యమంత్రి అన్నారు.

సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకురండి: మంత్రి ఉత్తమ్

ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్ల విషయంలో జిల్లాల్లో ఎక్కడ సమస్యలున్నా ప్రభుత్వం దృష్టికి తీసుకురావలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. ధాన్యం సేకరణ విషయంలో ఎలాంటి సహకారం అందించేందుకైనా ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు.

పొరుగు రాష్ట్రాల ధాన్యంతో సమస్యలు: మంత్రి తుమ్మల

సరిహద్దు రాష్ట్రాల రైతులు కొంతమంది ధాన్యాన్ని తెలంగాణలో కొనుగోలు కేంద్రాలకు తరలిస్తున్నారని, దీంతో కొన్నిచోట్ల సమస్యలు తలెత్తుతున్నాయని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అభిప్రాయపడ్డారు. అలా ధాన్యం రాకుండా కలెక్టర్లు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ నెలాఖరులోగా ధాన్యం సేకరణ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీతక్క, జూపల్లి కృష్ణారావు, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, వాకిటి శ్రీహరి, సీఎస్ రామకృష్ణారావు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## దేశంలోనే తొలి క్వాంటం కంప్యూటర్ ఏపీలో ఏర్పాటు చేస్తాం



రాష్ట్ర మంత్రి పయ్యావుల కేశవ్, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ, రాష్ట్ర సమగ్రాభివృద్ధిపై తన దార్శనికతను, ప్రభుత్వ ప్రణాళికలను ఆవిష్కరించారు. చిన్న స్థాయిలో ప్రారంభమైన కిమ్స్ ఆస్పత్రి ఇప్పుడు రూ.30 వేల కోట్ల సంస్థగా ఎదిగిన విషయాన్ని గుర్తుచేస్తూ, పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తేనే రాష్ట్రానికి, దేశానికి సంపద సృష్టి సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. అమరావతి అభివృద్ధికి అనేకమంది పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

గడువులతో కూడిన జవాబుదారీతనం

"గతంలో రాష్ట్రంలో 23 నెలల పాటు విధ్వంసం, అరాచకం చూశాను. అలాంటి పాలన నా జీవితంలో చూడలేదు. ఇప్పుడు శంకుస్థాపనలతో ఆగిపోకుండా, నిర్దేశిత గడువులోగా ప్రాజెక్టులు పూర్తి చేసి ప్రారంభోత్సవాలు కూడా జరుపుకోవాలి" అని చంద్రబాబు అన్నారు. ఈ మెడికల్ కాలేజీ, యూనివర్సిటీ నిర్మాణం 2027 నాటికి పూర్తి కావాలని ఆకాంక్షించారు. ఇటీవలే శంకుస్థాపన చేసిన గూగుల్ క్యాంపస్‌ను 2028 ఆగస్టుకు, ఆర్సెలార్ మిట్టల్ ప్లాంట్ మొదటి దశను 2028 డిసెంబరుకు పూర్తి చేయాలని ఆదేశాలిచ్చినట్లు తెలిపారు. "అనుమతులు ఆటోపైలట్ మోడ్‌లో ఇచ్చే బాధ్యత మాది. నిర్మాణాలు పూర్తి చేసి కార్యకలాపాలు ప్రారంభించే బాధ్యత పారిశ్రామికవేత్తలది" అని భరోసా ఇచ్చారు.

బొల్లినేని ప్రాజెక్టు వివరాలు

మొత్తం 25 ఎకరాల్లో ఈ ప్రాజెక్టు రూపుదిద్దుకోనుంది. ఇందులో 23 ఎకరాల్లో మెడికల్ కాలేజీ, 2 ఎకరాల్లో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు కానుంది. 500 పడకల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, 250 మెడికల్ సీట్లు, 1000 నాన్-మెడికల్ సీట్లు, మరో 1000 మందికి శిక్షణ ఇవ్వనున్నారు. తద్వారా లక్ష మందికి నైపుణ్యం అందించి, ప్రపంచవ్యాప్తంగా వైద్యులు, నర్సులు, పారామెడికల్ సిబ్బందికి ఉన్న డిమాండ్‌ను తీర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. "ప్రపంచంలో ప్రతి ముగ్గురు వైద్య సిబ్బందిలో ఒకరికి అమరావతిలోనే శిక్షణ ఇచ్చే స్థాయికి ఈ సంస్థ ఎదగాలి," అని సీఎం ఆకాంక్షించారు.

రాష్ట్ర సమగ్ర అభివృద్ధి ప్రణాళిక

ముఖ్యమంత్రి తన ప్రసంగంలో రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల అభివృద్ధికి సంబంధించిన ప్రణాళికలను వివరించారు.

టెక్నాలజీ: దేశంలోనే తొలి క్వాంటం కంప్యూటర్‌ను ఈ ఏడాది డిసెంబరు నాటికి అమరావతిలో ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు.

పరిశ్రమలు: రాయలసీమలో ఈ నెల 15న ఫైటర్ జెట్ పరిశ్రమకు శంకుస్థాపన చేయనున్నట్లు, కర్నూలును డ్రోన్ సిటీగా, శ్రీసిటీని ఇండస్ట్రియల్ హబ్‌గా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు.

నగరాభివృద్ధి: అమరావతితో పాటు విశాఖను కూడా విశ్వనగరంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు.

హరిత ఇంధనం: విదేశాలపై ఆధారపడకుండా, ప్రతి ఇంటిపైనా సోలార్ రూఫ్‌టాప్‌లతో విద్యుత్ ఉత్పత్తి చేసుకునేలా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం ప్రజలపై మోపిన రూ.32 వేల కోట్ల విద్యుత్ భారాన్ని తగ్గించామని, ఛార్జీలు పెంచకుండా తగ్గిస్తున్నామని పేర్కొన్నారు.

ఆరోగ్య రంగం: రాష్ట్ర బడ్జెట్‌లో వైద్యారోగ్యశాఖకు రూ.20 వేల కోట్లు కేటాయించామని, సంజీవని ద్వారా డిజిటల్ వైద్య సేవలు అందిస్తామని చెప్పారు. రాజధాని కోసం భూములు ఇచ్చిన రైతుల త్యాగాన్ని స్మరించుకున్న చంద్రబాబు, వారి భవిష్యత్తుకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అమరావతిని భవిష్యత్ నగరంగా నిర్మించి, రాష్ట్ర యువతకు లక్షల ఉద్యోగాలు కల్పించడమే తన ఆలోచన అని స్పష్టం చేశారు.

## కుమారుడి నేరం రుజువైతే బండి సంజయ్ పదవికి రాజీనామా చేయాలి

మొదటి పేజి తరువాయి

తెలంగాణ రక్షణ సేన చీఫ్ కవిత విమర్శనాస్త్రాలు సంధించారు. పోక్సో కేసులో ఉన్న బండి సంజయ్ కుమారుడు దేశం దాటి పోకుండా పోలీసులు వెంటనే లుకౌట్ నోటీసులు జారీ చేయాలని కవిత డిమాండ్ చేశారు. ఒకవేళ నేరం రుజువైతే బండి సంజయ్ తన మంత్రి పదవికి రాజీనామా చేయాలని స్పష్టం చేశారు. లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి తండ్రిగా బండి సంజయ్ ప్రధాని మోదీతో కలిసి వేదికను పంచుకోవడం ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు పంపిందని ఆమె అభిప్రాయపడ్డారు. బాధితురాలి జీవితాన్ని దెబ్బతీసేలా వీడియోలు పోస్ట్ చేసిన వారిని అరెస్ట్ చేయాలని, ఆ అకౌంట్లను బ్లాక్ చేయాలని కోరారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా కోసం సీఎం రేవంత్ రెడ్డి కేంద్రానికి లేఖ రాయాలని కవిత అన్నారు. ఇప్పటివరకు ఆయన ఈ ప్రాజెక్టును ఒక్కసారి కూడా సందర్శించకపోవడం ఏమిటని ఆమె ఆక్షేపించారు. ఏపీ సీఎం చంద్రబాబు పోలవరం కోసం కేంద్రంపై ఒత్తిడి తెస్తున్నారని, కానీ తెలంగాణ ప్రభుత్వం నీటి వనరుల వినియోగంలో విఫలమవుతోందని విమర్శించారు. తెలంగాణ రక్షణ సేన అధికారంలోకి వస్తే వాటర్ కమిషన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కులగణనలో ఓబీసీ కాలమ్ తప్పనిసరిగా ఉండాలని, బీసీలకు 50 శాతం రిజర్వేషన్ల సాధన కోసం దేశవ్యాప్తంగా పోరాడతామని కవిత తెలిపారు. నీట్ పేపర్ లీక్ గురించి ఆమె మాట్లాడుతూ... జాతీయ స్థాయి పరీక్షల పేపర్ లీక్ ఘటనలను కేంద్రం సీరియస్‌గా తీసుకోవాలని, విద్యార్థుల జీవితాలతో ఆడుకోవద్దని హెచ్చరించారు. తెలంగాణలో ఉన్న రాజకీయ శూన్యతను భర్తీ చేయడానికే తమ పార్టీ పుట్టిందని ఆమె ఈ సందర్భంగా పేర్కొన్నారు.


## ప్రపంచ స్థాయి బ్రాండ్లు ఏపీ నుంచే తయారవుతున్నాయి

మొదటి పేజి తరువాయి

రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. రాష్ట్రంలోని తయారీ రంగం పురోగతిని వివరిస్తూ ఆయన బుధవారం సోషల్ మీడియాలో ఓ ఆసక్తికర పోస్ట్ చేశారు. దీనికి సంబంధించిన ఓ ప్రత్యేక వీడియోను కూడా పంచుకున్నారు. "మొబైల్ ఫోన్లు, స్క్రీన్ల నుంచి మొదలుకొని ఏసీలు, బైక్‌లు, కార్ల వరకు.. భారతీయులు విశ్వసించే ఎన్నో బ్రాండ్లు ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో తయారవుతున్నాయి" అని లోకేష్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉన్న ప్రపంచ స్థాయి మౌలిక వసతులు, పనుల వేగవంతమైన అమలు, బలమైన తయారీ వ్యవస్థ వల్లే ఇది సాధ్యమైందని వివరించారు. "మేడ్ ఇన్ ఆంధ్రప్రదేశ్ అనేది వేగంగా నాణ్యతకు, నమ్మకానికి ప్రతీకగా నిలుస్తోంది. ఈ ప్రయాణంలో మీరు కూడా భాగస్వాములు కండి. ఆంధ్రప్రదేశ్‌లో తయారు చేయండి.. ప్రపంచం కోసం తయారు చేయండి" అని లోకేష్ పిలుపునిచ్చారు. ఆయన షేర్ చేసిన వీడియోలో ఏపీలో కార్యకలాపాలు సాగిస్తున్న పలు ప్రఖ్యాత కంపెనీల ఉత్పత్తులను, తయారీ యూనిట్లను ప్రదర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడులను ఆకర్షించేందుకు, పారిశ్రామిక అభివృద్ధిని ప్రోత్సహించేందుకు కట్టుబడి ఉందని ఈ పోస్ట్ ద్వారా స్పష్టమవుతోంది.

## రైతులకు గుడ్ న్యూస్.. పంటల మద్దతు ధరను పెంచుతూ కేంద్రం నిర్ణయం

మొదటి పేజి తరువాయి



రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడమే లక్ష్యంగా, ఖరీఫ్ పంటల కనీస మద్దతు ధరను ప్రభుత్వం పెంచింది. పెట్టుబడి ఖర్చుపై 50 శాతం అదనంగా కలిపి కొత్త ధరలను ఖరారు చేశారు. వరి క్వింటాల్‌కు రూ. 2,441 గా నిర్ణయించారు. గ్రేడ్-ఏ వరి క్వింటాల్‌కు రూ. 2,461 గా మద్దతు ధరను ఖరారు చేశారు. ఈ ఖరీఫ్ సీజన్ మద్దతు ధర కోసం కేంద్రం ఏకంగా రూ. 2.6 లక్షల కోట్లను కేటాయించడం విశేషం. వ్యవసాయంతో పాటు రవాణా, ఇంధన రంగాలకు కూడా కేంద్ర కేబినెట్ పెద్దపీట వేసింది. మహారాష్ట్రలోని నాగ్‌పూర్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రపంచ స్థాయి ప్రమాణాలతో అప్‌గ్రేడ్ చేసేందుకు ఆమోదం తెలిపారు. ఇంధన భద్రత కోసం ఈ పథకానికి రూ. 37,500 కోట్లు కేటాయించారు. సర్కేజీ - ధోలేరా మధ్య సెమీ హై స్పీడ్ డబుల్ రైల్వే లైన్ నిర్మాణం కోసం రూ. 20,065 కోట్లు మంజూరు చేస్తూ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.

## ఇది కొత్త రియాలిటీ... దీన్ని ప్రోత్సహిద్దాం

అమరావతి: ఇంటి నుంచే ప్రపంచం మొత్తం పనిచేసే పరిస్థితి వస్తోందని, ఈ నూతన వాస్తవికతను అందరూ ప్రోత్సహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ప్రభుత్వంలోనూ భవిష్యత్తులో ఈ తరహా విధానాన్ని అమలు చేసే అవకాశాలు వస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. పశ్చిమ ఆసియాలో యుద్ధ వాతావరణం నెలకొన్న నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ జాతికి ఇచ్చిన 8 పొదుపు సూచనలను రాష్ట్ర ప్రజలందరూ పాటించాలని ఆయన పిలుపునిచ్చారు. ఇలాంటి క్లిష్ట సమయాల్లో ప్రభుత్వాలతో పాటు పౌరులు కూడా బాధ్యతగా ఉండి ఆర్థిక ఇబ్బందులను అధిగమించాలని సూచించారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం తరపున ఒకటి రెండు రోజుల్లో ప్రత్యేక కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. అమరావతిలోని నిడమర్రులో బొల్లినేని ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్కిల్, ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (బైసర్) శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ప్రధాని సూచనల మేరకు పెట్రోల్, డీజిల్ వినియోగాన్ని తగ్గించడం ద్వారా విలువైన విదేశీ మారకద్రవ్యాన్ని ఆదా చేయవచ్చని చంద్రబాబు అన్నారు. "దేశం మొత్తం దుబారాను తగ్గించాలి. పెద్ద పెద్ద కాన్వాయ్ వాహనాల్లో వెళ్లడం ఒక ఫ్యాషన్‌గా మారింది. ప్రజాప్రతినిధులు కాన్వాయ్ వాహనాల సంఖ్య తగ్గించి ఆదర్శంగా నిలవాలి. భద్రతను కూడా కుదించుకోవాలి" అని ఆయన హితవు పలికారు. విదేశీ పర్యటనలు తగ్గించుకోవాలని, బంగారం కొనుగోళ్లపై కూడా ప్రజలు ఆలోచించాలని సూచించారు. మన దేశంలో, రాష్ట్రంలో అద్భుతమైన పర్యాటక ప్రాంతాలున్నాయని, విదేశాలకు బదులు స్వదేశీ పర్యాటకానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అరకు, పాపికొండలు, గండికోట వంటి ప్రదేశాలు ఎంతో అందమైనవని, సూర్యలంకను గోవాను మించిన పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. "నా దేశం - నా బాధ్యత" అనే స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని కోరారు.

### అమరావతికి వైద్య, విద్య హబ్ గుర్తింపు

ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు రాష్ట్ర అభివృద్ధి ప్రణాళికలను వివరించారు. పరిశ్రమల ఏర్పాటుకు అనుమతులన్నీ ఆటోపైలట్ మోడ్‌లో ఇచ్చే బాధ్యత తమదని, పారిశ్రామికవేత్తలు వేగంగా నిర్మాణాలు పూర్తిచేసి కార్యకలాపాలు ప్రారంభించాలని కోరారు. విద్య, వైద్య రంగాల్లో ఆంధ్రప్రదేశ్ తిరుగులేని శక్తిగా ఎదగాలని ఆకాంక్షించారు. "ప్రపంచంలోని ప్రతి ముగ్గురు వైద్యులు, నర్సులు, పారామెడికల్ సిబ్బందిలో ఒకరు అమరావతి నుంచే తయారుకావాలి," అని ఆయన తన లక్ష్యాన్ని స్పష్టం చేశారు. బైసర్, కిమ్స్ సంస్థలు ఈ లక్ష్య సాధనకు దోహదపడతాయన్నారు. 500 పడకల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, 250 మెడికల్ సీట్లు, నైపుణ్యాభివృద్ధి ద్వారా లక్ష మందికి ఉపాధి కల్పించేలా ఈ సంస్థలు విస్తరించనున్నాయని తెలిపారు. వచ్చే ఏడాది ఇదే రోజున కిమ్స్ ఆసుపత్రి ప్రారంభం కావాలని ఆకాంక్షించారు.

## ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై రానున్న రెండేళ్లూ పోరాడాలి

సిద్దిపేట: "రాష్ట్రంలో ప్రస్తుతం జిల్లాకో సమస్య నెలకొని ఉంది. ఈ నేపథ్యంలో ఆయా జిల్లాల వారీగా ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై ఎలుగెత్తాలి. ఈ మేరకు ప్రణాళికలు సిద్ధం చేసుకుని ఉద్యమించాలి" అని భారాస అధినేత కేసీఆర్ తమ పార్టీ ముఖ్య నేతలకు ఆదేశించారు. పార్టీ సభ్యత్వ నమోదును డిజిటల్ పద్ధతిలో చేపట్టాలని నిర్ణయించారు. సభ్యత్వ నమోదు బాధ్యతలను ఉమ్మడి జిల్లాల వారీగా పార్టీ ప్రధాన కార్యదర్శులకు అప్పగించారు. సిద్దిపేట జిల్లా ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో మంగళవారం పార్టీ ప్రధాన కార్యదర్శులు, ముఖ్యనేతలతో ఆయన సమావేశం నిర్వహించారు. సుమారు ఆరు గంటలపాటు కొనసాగిన ఈ సమావేశంలో... ధాన్యం, శనగలు, మక్కల రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, కొనుగోళ్లలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను పలువురు నేతలు తమ అధినేత దృష్టికి తీసుకొచ్చారు. రాష్ట్ర రాజకీయ పరిణామాలపైనా చర్చించారు. అనంతరం కేసీఆర్ మాట్లాడుతూ... "రాష్ట్రంలో అన్నదాతలతోపాటు అన్నివర్గాల ప్రజలూ సమస్యలతో సతమతమవుతున్నారు. వారికి పార్టీ అండగా నిలవాలి. రానున్న రెండేళ్లపాటు ప్రజాక్షేత్రంలో ఉండేలా పోరాట పథాన్ని ఎంచుకోవాలి. సామాజిక మాధ్యమాలను విస్తృతంగా వినియోగించుకోవాలి. ఓటరు జాబితాల సమగ్ర సవరణ(సర్)పైనా ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలి. జిల్లా కేంద్రాల్లో శిక్షణ.. సభ్యత్వ నమోదు కమిటీలు: సభ్యత్వాల నమోదుకు ఒక్కో పోలింగ్ కేంద్రానికి ఇద్దరు కార్యకర్తలను ఎంపిక చేసి, వారికి జిల్లా కేంద్రాల్లో సాంకేతిక నిపుణులతో శిక్షణ ఇప్పించాలి. మండలాలు, పురపాలికలకు ఐదుగురు నేతలతో సమన్వయ కమిటీలను రెండు, మూడు రోజుల్లో వేయాలి. సభ్యత్వ నమోదును పర్యవేక్షించేందుకు రాష్ట్రకమిటీ నుంచి అసెంబ్లీ నియోజకవర్గానికో సమన్వయకర్తను నియమించాలి. పల్లెలు, పట్టణ కమిటీలో నాయకుల బంధువులకు స్థానం లేదు. పార్టీ అభివృద్ధి కోసం పనిచేస్తున్న నాయకులకే పట్టం కట్టాలి. బలంగా లేని నియోజకవర్గాలపై దృష్టి: రాష్ట్రంలోని కొన్ని నియోజకవర్గాల్లో పార్టీ బలహీనంగా ఉన్నట్లు కనిపిస్తోంది. వాటిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలి. అవసరమైతే ఆయా నియోజకవర్గాల్లో భారీ బహిరంగ సభలు నిర్వహించాలి. మండలం, జిల్లా, పురపాలికల స్థాయుల్లో కొత్త నేతలను తయారు చేయాలి. పార్టీలోకి బలమైన వర్గాలకు చెందిన ముఖ్యనేతలను ఆహ్వానించాలి. త్వరలో జిల్లాల వారీగా పార్టీ పరిస్థితిని సమీక్షిస్తా. పరిషత్, జీహెచ్ఎంసీ ఎన్నికలకు సిద్ధం: ప్రభుత్వం త్వరలో ప్రాదేశిక నియోజకవర్గాల(పరిషత్)కు, జీహెచ్ఎంసీ, వరంగల్, సిద్దిపేట, ఖమ్మం నగరపాలక సంస్థలకు ఎన్నికలు నిర్వహించే అవకాశముంది. ఈ నేపథ్యంలో ఇప్పటి నుంచే కార్యకర్తలను ఎన్నికలకు సమాయత్తం చేయాలి. జీహెచ్ఎంసీలో మెజారిటీ డివిజన్లు గెలుపొందేలా వ్యూహాలను రచించాలి" అని దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో పార్టీ నేతలు కేటీఆర్, హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, జీవన్‌రెడ్డి, ఎస్.మధుసూదనాచారి, ఎల్.రమణ, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్, టి.రవీందర్‌రావు, డా.పల్లా రాజేశ్వర్‌రెడ్డి, డా.బండాప్రకాశ్, రావుల చంద్రశేఖర్‌రెడ్డి, సత్యవతి రాథోడ్, జోగినపల్లి సంతోష్‌కుమార్, వి.గంగాధర్‌గౌడ్, మహమూద్ అలీ, కేఆర్ సురేశ్‌రెడ్డి, సోమా భరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఆసుపత్రులు, ప్రభుత్వ కార్యాలయాల్లో 'ఫైర్ ఆడిట్'కు కలెక్టర్ ఆదేశం




గుంటూరు జిల్లా మే 13 : ఆసుపత్రులు, కార్యాలయాల్లో ఫైర్ ఆడిట్ నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ సి.యం.సాయి కాంత్ వర్మ తెలిపారు. మంగళ, బుధవారాలలో జరిగిన అగ్ని ప్రమాదాలు దృష్ట్యా బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా ప్రతినిధుల సమావేశంలో జిల్లా కలెక్టర్ పలు విషయాలను వెల్లడించారు. ఫైర్ ఆడిట్ తో పాటు ఆసుపత్రిలో సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ ఆడిట్ నిర్వహించాలని ఆదేశించినట్లు తెలిపారు. ప్రతి నెల ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులలో మాక్ డ్రిల్ నిర్వహించాలని సూచించినట్లు చెప్పారు. ఫైవ్ ఆడిట్ లో కనుగొన్న లోపాలను సంబంధిత ఆసుపత్రిలు, కార్యాలయాలు తక్షణం పునరుద్ధరణ చేయాలని పేర్కొన్నారు. అగ్నిమాపక పరికరాల ఎక్స్పైరీ డేట్ ను కూడా విధిగా పరిశీలించాలని అన్నారు. వేసవి తీవ్రత ఉందని ఈ సమయంలో విద్యుత్తు ఉపకరణాలు వినియోగం అధికంగా ఉంటుందని విద్యుత్ లోడుకు తగిన విధంగా లేనట్లయితే షార్ట్ సర్క్యూట్ అయ్యే ప్రమాదం ఉంటుందని పేర్కొంటూ అటువంటి లోపాలు కనుగొనుటకు విద్యుత్ ఆడిట్ ను నిర్వహించాలని ఆదేశించినట్లు తెలిపారు. అగ్నిమాపక పరికరాల వినియోగం, నిర్వహణ అమలును పర్యవేక్షణ చేయడం జరుగుతుందని చెప్పారు. షాపింగ్ మాల్స్, సినిమా హాల్ లు తదితర ప్రదేశాల్లో సైతం అగ్ని మాపక పరికరాల పనితీరు పరిశీలించడం జరుగుతుందని అన్నారు. మొదటగా వంద పడకలకు పైగా ఉన్న ఆసుపత్రుల్లో ఫైర్ ఆడిట్ నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. గత నెలలో అగ్ని ప్రమాదాలపై మీడియాలో ప్రచురితమైన ఒక వార్త బాగా ఉపయోగపడిందని జిల్లా కలెక్టర్ అన్నారు. వార్త సమాచారంతో వెంటనే అగ్నిమాపక అధికారికి ఆదేశాలు జారీ చేయడం జరిగిందని ఆ మేరకు జి జి హెచ్ లో మాకు డ్రిల్ నిర్వహణ అవగాహన కార్యక్రమాలు నిర్వహించారని తెలిపారు. ఈ మార్క్ డ్రిల్ కార్యక్రమం మంగళవారం జరిగిన అగ్ని ప్రమాద నివారణకు ఎంతగానో తోడ్పడిందని అన్నారు. ప్రజల రక్షణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. ఈ మీడియా సమావేశంలో జిల్లా అగ్నిమాపక అధికారి ఎం శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

## చీరాల బాధితులకు అండగా సీఎం సహాయనిధి ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య

### 61 మంది లబ్ధిదారులకు రూ. 40.58 లక్షల చెక్కుల పంపిణీ

నియోజకవర్గంలో ఇప్పటివరకు 950 మందికి రూ. 9 కోట్ల ఆర్థిక సాయం

కూటమి ప్రభుత్వంలో పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందడమే లక్ష్యం



బాపట్ల జిల్లా చీరాల, మే 13: అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి కొండంత అండగా నిలుస్తోందని చీరాల శాసనసభ్యులు మద్దులూరి మాలకొండయ్య పేర్కొన్నారు. బుధవారం చీరాలలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 61 మంది లబ్ధిదారులకు వైద్య ఖర్చుల నిమిత్తం మంజూరైన రూ. 40,58,831/- విలువైన చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాలకొండయ్య మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సహకారంతో చీరాల నియోజకవర్గంలో ఇప్పటివరకు 950 మంది బాధితులకు రూ. 9 కోట్ల సహాయాన్ని అందించినట్లు వెల్లడించారు. పేద ప్రజల ఆరోగ్యంపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందని, కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన పేదలు తమ వైద్య ఖర్చుల రసీదులతో దరఖాస్తు చేసుకుంటే, ప్రభుత్వం వాటిని పరిశీలించి సత్వరమే నిధులు విడుదల చేస్తోందని తెలిపారు.ప్రజా సంక్షేమమే ధ్యేయం రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ వైద్యశాలల్లో కూడా కార్పొరేట్ స్థాయి సదుపాయాలను కల్పించే దిశగా ముఖ్యమంత్రి అడుగులు వేస్తున్నారని ఎమ్మెల్యే కొనియాడారు. మెరుగైన సమాజం, ఆరోగ్యవంతమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. ఆపద సమయంలో ఆర్థిక సహాయం అందించి ఆదుకుంటున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కి, నిధుల మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే మాలకొండయ్యకు లబ్ధిదారులు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ కౌతరపు జనార్ధన్, చీరాల మండల అధ్యక్షులు గంజి పురుషోత్తం, పట్టణ అధ్యక్షులు సురేష్, నాయకులు సాంబశివరావు, పిక్కి నారాయణ, వివిధ గ్రామాల పార్టీ అధ్యక్షులు కూటమి నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వైద్య సేవలు, ఆహ్లాదకర వాతావరణమే లక్ష్యం జిల్లా కలెక్టర్ డా. వి. వినోద్ కుమార్



బాపట్ల జిల్లా మే 13 : పట్టణ పరిధిలో నిర్మాణం చేపట్టుతున్న పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పనులు వెంటనే పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ పేర్కొన్నారు. బాపట్ల పట్టణంలో నూతనంగా నిర్మాణం చేపడుతున్న పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పెయింటర్స్ కాలనీలో నిర్మాణంలో ఉన్న మున్సిపల్ పార్క్ పనులను జిల్లా కలెక్టర్ బుధవారం రాత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనుల పురోగతిని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనులు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా వేగవంతంగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉపయోగపడుతుందన్నారు. ఆధునిక సౌకర్యాలతో ఆరోగ్య కేంద్రాన్ని అభివృద్ధి చేయాలని, మున్సిపల్ కమిషనర్, డి యం ఒ హెచ్ ఓ ను ఆదేశించారు. అలాగే పెయింటర్స్ కాలనీలో నిర్మాణంలో ఉన్న మున్సిపల్ పార్క్‌ను పరిశీలించి, పట్టణ ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించే విధంగా పార్క్‌ను అభివృద్ధి చేయాలన్నారు. పిల్లలు, యువకులు, వృద్ధులు మహిళలకు ఉపయోగపడేలా అవసరమైన సౌకర్యాలు కల్పించాలని మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు.పట్టణ అభివృద్ధి పనుల్లో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్ణీత గడువులో పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో డి యం ఒ హెచ్ ఓ.డాక్టర్ ఎస్.విజయమ్మ,మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథ్ రెడ్డి, డి ఎస్ కృష్ణ రెడ్డి మున్సిపల్ అధికారులు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ఇంజినీరింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పి.ఎం.డి.ఎస్ పద్ధతితోనే రైతులకు లాభం



### సహాయ వ్యవసాయ సంచాలకులు వెంకటరాముడు

యాడికి మే 13 అనంతపురం జిల్లా రిపోర్టర్ బండారు బాలకృష్ణ నేటి శుభోదయ తెలుగు దినపత్రిక: తొలకరి వర్షాల కంటే ముందే విత్తనాలు విత్తుకునేలా రైతులను సమాయత్తం చేసే లక్ష్యంతో యాడికి మండలం నిట్టూరు రైతు సేవా కేంద్రంలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గుత్తి డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు (ఏ.డి.ఏ) వెంకటరాముడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

అవగాహన అంశాలు:

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పి.ఎం.డి.ఎస్ (ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్) పద్ధతిపై రైతులకు ఆయన విస్తృత అవగాహన కల్పించారు. వర్షం రాకముందే ఈ నెలలో 25 రకాల విత్తనాలను బీజామృతం, ఘనజీవామృతంతో కలిపి విత్తడం వల్ల ఏడాది పొడవునా ఆదాయం పొందే అవకాశం ఉంటుందని



వివరించారు. ఈ పద్ధతికి అధిక వర్షపాతం అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు.

ఎల్ నినో ప్రభావంపై సూచనలు:

ఈ ఏడాది ఎల్ నినో ప్రభావం ఉండే అవకాశం ఉన్నందున, రైతులు పి.ఎం.డి.ఎస్ పద్ధతిని పాటిస్తే సాగులో కొంత ఉపశమనం లభిస్తుందని తెలిపారు. అధిక ఉష్ణోగ్రతల నుండి ప్రకృతిని కాపాడుకోవడానికి కూడా ఈ విధానం దోహదపడుతుందని పేర్కొన్నారు.అనంతరం, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మరియు రైతు సేవా కేంద్రం సిబ్బందితో సమీక్ష నిర్వహించిన ఏ.డి.ఏ, ప్రతి గ్రామంలోనూ ఎక్కువ మంది రైతులు ఈ పద్ధతి ద్వారా సాగు చేసేలా ప్రోత్సహించాలని అధికారులను కోరారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మహబూబ్ బాషా, వ్యవసాయ విస్తరణ అధికారి రజిత, గ్రామ వ్యవసాయ అధికారులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మరియు నిట్టూరు గ్రామ రైతులు పాల్గొన్నారు.

# యుద్ధప్రాతిపదికన అభివృద్ధి పనులు చేపట్టండి ట్రాఫిక్ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోండి

డ్రెయిన్ల నిర్మాణం వేగవంతం చేయండి

నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించండి

అధికారులతో కలిసి క్షేత్రస్థాయి పర్యటన చేసిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్




గుంటూరు మే 13 : గుంటూరు తూర్పు నియోజకవర్గంలో డ్రెయిన్లు, రోడ్లు, విద్యుత్ సరఫరా ట్రాఫిక్ వంటి అన్ని రకాల అభివృద్ధి కార్యక్రమాలను ప్రణాళికాబద్ధంగా వేగవంతంగా పూర్తి చేసేందుకు ఎమ్మెల్యే నసీర్ క్షేత్రస్థాయి పర్యటన చేపట్టారు. బుధవారం గుంటూరు తూర్పు నియోజకవర్గంలో మున్సిపల్ శానిటేషన్, విద్యుత్ ఇంజనీరింగ్, ట్రాఫిక్ పోలీసులో కలిసి ఎమ్మెల్యే నసీర్ వివిధ ప్రాంతాలకు పరిశీలించారు. తొలుత జిన్నా టవర్ సెంటర్ నుంచి బస్టాండ్ వరకు చేపట్టిన డ్రెయిన్ల నిర్మాణానికి సంబంధించి ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడారు. ఈ ప్రాంతం ట్రాఫిక్ రద్దీగా ఉంటుందని, త్వరగా పనులు పూర్తి చేయాలని సూచించారు. మణిపురం బ్రిడ్జి వెంట సర్వీసు రోడ్డులో మౌలిక వసతిల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అనంతరం అధికారులతో కలిసి కబడ్డీ గూడెం ప్రాంతంలో పర్యటించారు. అక్కడ డ్రెయిన్ల విస్తరతోపాటు శ్మశాన వాటికలో వసతుల కల్పనపై చర్చించారు. కొత్తపేటలోని బ్రింద న్యూరో కేర్ వద్ద డ్రెయిన్ నిర్మాణంపై చర్చించారు. అదే సమయంలో ఆటోనగర్ ప్రధాన డ్రెయి? నిర్మాణం విషయంలో వేగవంతంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఆటోనగర్ నుంచి ఇన్నర్ రింగ్ రోడ్డు వరకు ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని సంబంధిత పోలీస్ అధికారులకు సూచించారు. దీనిపై వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో పక్కా ప్రణాళికతో అభివృద్ధి పనులు కొనసాగిస్తున్నామని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చాక ప్రతి ప్రాంతాన్ని సమాన స్థాయిలో అభివృద్ధి పథంలోకి తీసుకెళుతున్నామని స్పష్టం చేశారు.

# యువతే దేశ భవిష్యత్తు.. క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలి: మంత్రి నాదెండ్ల మనోహర్

జంక్ ఫుడ్ వద్దు.. ఆరోగ్యంపై శ్రద్ధ వహించండి

టెక్నాలజీని విజ్ఞానం కోసం వాడాలి.. సోషల్ మీడియా కోసం కాదు

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది




గుంటూరు జిల్లా తెనాలి, మే 13 : విద్యార్థులు తమ జీవితంలో స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకుని, కష్టపడి చదివి కుటుంబానికి, సమాజానికి మరియు దేశానికి గర్వకారణంగా నిలవాలని రాష్ట్ర ఆహార, పౌరసరఫరాలు మరియు వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రివర్యులు నాదెండ్ల మనోహర్ పిలుపునిచ్చారు. బుధవారం గుంటూరు జిల్లా తెనాలిలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన పాల్గొని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు నేర్పే సంస్కారమే జీవితానికి పునాది అని మంత్రి పేర్కొన్నారు. ఒక సాధారణ కుటుంబం నుంచి ఎదిగి సమాజంలో గుర్తింపు పొందిన 'కుమార్' ప్రయాణం ప్రతి విద్యార్థికి స్ఫూర్తిదాయకమని ఆయన కొనియాడారు. ప్రతిభ ఉన్న ప్రతి విద్యార్థికి, ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే వారికి అండగా నిలవాల్సిన బాధ్యత సమాజంపై ఉందన్నారు. ప్రస్తుత కాలంలో యువతలో పెరుగుతున్న ఆరోగ్య సమస్యల పట్ల మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. ప్రాసెస్ ఫుడ్, జంక్ ఫుడ్ సంస్కృతి వల్ల చిన్న వయసులోనే అనారోగ్యాలు వస్తున్నాయని, విద్యార్థులు శారీరక దృఢత్వం కోసం పౌష్టికాహారంపై శ్రద్ధ పెట్టాలని సూచించారు. విద్యార్థులు సోషల్ మీడియాకే పరిమితం కాకుండా, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, స్పేస్ టెక్నాలజీ వంటి ఆధునిక రంగాల్లో నాలెడ్జ్ పెంచుకునేందుకు టెక్నాలజీని ఉపయోగించుకోవాలని కోరారు.ప్రభుత్వ సహకారం ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల మెరుగుదలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. దాతల సహకారం మరియు సీఎస్ఆర్ నిధుల ద్వారా పాఠశాలల్లో మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. విద్యార్థుల విద్య ఆరోగ్య పరిరక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పలు కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. భారతదేశం - అగ్రగామి : రాబోయే రోజుల్లో భారతదేశం ప్రపంచంలోనే అగ్రదేశంగా నిలవబోతోందని, ఆ ప్రయాణంలో యువత కీలక పాత్ర పోషించాలని మంత్రి నాదెండ్ల మనోహర్ ఆకాంక్షించారు. క్రమశిక్షణ, కృషితో ప్రతి విద్యార్థి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆయన ఆశీర్వదించారు.

# ఎన్ టి ఆర్ తో పాటు ప్రజల ఆశీర్వాదంతోనే గుర్తింపు

### తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

### - నిస్వార్థ నాయకుడు తుమ్మల ఆత్మీయ సభలో ఎంఎల్ఏ కూనంనేని



ఖమ్మం, నేటి శుభోదయ ::: నందమూరి తారక రామారావు పిలుపుతో రాజకీయాల్లోకి వచ్చిన తనకు ప్రజల ఆశీర్వాదంతోనే గుర్తింపు లభించిందని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. శ్రీ సీతారామ చంద్రస్వామి దయతో ప్రజలకు సేవ చేసే భాగ్యం తనకు కలిగిందని, తన 40 ఏళ్ల రాజకీయ జీవితంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసమే పని చేసినట్లు తనకు అవకాశం కల్పించిన ఉమ్మడి ఖమ్మంజిల్లా ప్రజలకు ఈ సందర్భంగా పేరు పేరునా కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తొలిసారి మంత్రిగా బాధ్యతలు చేపట్టి 40 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఖమ్మం ఎస్ఆర్అండ్ బిజిఎన్ఆర్ కళాశాల మైదానంలో బుధవారం ఆత్మీయ సభ నిర్వహించారు. తొలుత రాపర్తి నగర్ నుంచి ఎస్ఆర్అండ్ బిజిఎన్ఆర్ మైదానం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఎన్టీఆర్ సర్కిల్లోని ఎన్టీఆర్ విగ్రహానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం సభలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ స్వర్గీయ నందమూరి తారక రామారావు పిలుపు మేరకు 1982లో రాజకీయాల్లోకి వచ్చినట్లు తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. 1986 మే 14న మొదటిసారి నందమూరి తారక రామారావు మంత్రి వర్గంలో మంత్రిగా బాధ్యతలు స్వీకరించినట్లు తెలిపారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు నలుగురు ముఖ్యమంత్రులు నందమూరి తారక రామారావు, నారా చంద్రబాబు నాయుడు, కల్వకుంట్ల చంద్రశేఖర్రావు, రేవంత్ రెడ్డి మంత్రి వర్గంలో తాను మంత్రిగా బాధ్యతలు నిర్వహించినట్లు తెలిపారు. తాను ఏ పార్టీలో ఉన్న ఉమ్మడి ఖమ్మం జిల్లా అభివృద్ధి కోసమే పని చేసినట్లు తెలిపారు. మారుమూల ప్రాంతాలు, ఏజెన్సీ ఏరియాల్లో కూడా అక్కడి ప్రజలకు మెరుగైన మౌలిక వసతుల కల్పనకు కృషి చేసినట్లు తెలిపారు. రహదారులు, విద్యుత్, విద్య, వైద్యం వంటి సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. ప్రజలకు త్రాగునీటి ఇబ్బందులు లేకుండా ప్రతి ఊరికి నీటిని అందించినట్లు తెలిపారు.



ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మెరుగైన రవాణా సౌకర్యం కల్పించేందుకు రహదారుల ఏర్పాటుతో పాటు ఖమ్మం చుట్టూ జాతీయ రహదారుల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. భక్తరామదాసు ప్రాజెక్టు ద్వారా పాలేరు ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసినట్లు తెలిపారు. నాగార్జున సాగర్ కాలువపై పలు ప్రాంతాల్లో ఎత్తి పోతల పథకాలను ఏర్పాటు చేసి సాగునీటిని అందించామన్నారు. ఏ పార్టీ అధికారంలో ఉన్న ప్రజల కోసమే తాను పనిచేశానన్నారు. అవినీతి లేని సుపరిపాలన అందించడమే తన లక్ష్యమన్నారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా ఖమ్మం జిల్లాను సస్య శ్యామలం చేయడమే తన లక్ష్యమని తెలిపారు. 40 ఏళ్ల పాటు తనను ఆదరిస్తూ, అభిమానిస్తున్న జిల్లా ప్రజలకు, నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

- మచ్చలేని నాయకుడు మంత్రి తుమ్మల : ఎంఎల్ఏ కూనంనేని

తన 40 ఏళ్ల రాజకీయ జీవితంలో మచ్చలేని నాయకునిగా ప్రజలకు సేవలు అందించిన ఘనత మంత్రి తుమ్మల నాగేశ్వరరావుదని కొత్తగూడెం ఎంఎల్ఏ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తెలిపారు. ప్రజాస్వామ్యంలో వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రజలకు సేవకుడిలా పని చేశారన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో తనకు 40 ఏళ్ల అనుబంధం ఉందన్నారు. తాను మండల పరిషత్ అధ్యక్షునిగా ఉన్నప్పుడు తుమ్మల నాగేశ్వరరావు మంత్రిగా ఉన్నారని గుర్తు చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మచ్చ లేని నాయకునిగా నిలిచారన్నారు. ప్రజలకు అవసరమైన సౌకర్యాల కల్పనకు పెద్దపీట వేశారు. ప్రస్తుత రాజకీయాల్లో సేవ చేసే వారు కాకుండా వ్యాపారులు వస్తున్నారని ఇటువంటి తరుణంలో కూడా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నిస్వార్థంగా సేవలు అందిస్తున్నారన్నారు. 40 ఏళ్ల రాజకీయ జీవితంలో 20 ఏళు మంత్రిగా పనిచేసిన ఘనత తుమ్మల నాగేశ్వరరావుదన్నారు. కమ్యూనిస్టులతో టిడిపి పొత్తు ఉన్న సమయంలో కూడా కమ్యూనిస్టు నాయకులతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగి ఎటువంటి అరమరికలు లేకుండా పాలన సాగించారన్నారు. ముక్కుసూటి తత్వం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నైజం అన్నారు. ఏ అంశంపై న అయినా సుదీర్ఘంగా అసెంబ్లీలో మాట్లాడగలిగే వ్యక్తి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఈ ఆత్మీయ సమావేశంలో మాజీ ఎంఎల్ఏ గుమ్మడి నర్సయ్య, సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా, టిడిపి నాయకులు వాసిరెడ్డి రామనాథం, మాజీ జెడ్పి ఛైర్మన్ గడిపల్లి కవిత, టీజీవో రాష్ట్ర కార్యదర్శి ఏలూరి శ్రీనివాసరావు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మిత్రులు కందిమళ్ల కృష్ణారావు తదితరులు ప్రసంగించారు. అనంతరం మంత్రి తుమ్మల నాగేశ్వరరావును వివిధ పార్టీల నాయకులు, అభిమానులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ మరియు నగదును అందించిన వన్ టౌన్ సీఐ పూడి వరప్రసాద్



విశాఖపట్నం, మే 13, : శంఖబ్రత బాగ్చి, ఐ.పి.ఎస్., కమిషనర్ ఆఫ్ పోలీస్ మరియు అదనపు జిల్లా మెజిస్ట్రేట్ ఆదేశాల మేరకు వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక వ్యక్తి మొబైల్ ఫోన్ మరియు నగదును పోగొట్టుకున్నట్లు కాల్ రావడంతో సిబ్బంది వెంటనే స్పందించి, పోగొట్టుకున్న వస్తువులను గంటల వ్యవధిలో కనిపెట్టి,సదరు వ్యక్తికి అప్పగించడమైనది. పోలీసులు స్పందించిన తీరుకు సదరు వ్యక్తి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసాడు.

## ఉదయనిధి స్టాలిన్ వ్యాఖ్యలు దేశద్రోహం కాపు పొలిటికల్ జేఏసీ చైర్మన్ వేల్పురి శ్రీనివాసరావు

**సనాతన ధర్మంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలి**

**డీఎంకే పార్టీని రద్దు చేయాలని ఎన్నికల సంఘానికి డిమాండ్**

**ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ మౌనంపై విమర్శలు**



అమరావతి, మే 13 : సనాతన ధర్మంపై తమిళనాడు నేత ఉదయనిధి స్టాలిన్ చేసిన వ్యాఖ్యలు అత్యంత హేయమైనవని, అవి దేశద్రోహంతో సమానమని కాపు పొలిటికల్ జేఏసీ చైర్మన్ వేల్పురి శ్రీనివాసరావు మండిపడ్డారు. మంగళవారం అమరావతిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఉదయనిధి స్టాలిన్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. నిర్ణయాత్మక చర్యలు తీసుకోవాలి:తమిళనాడు అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా ఉన్న ఉదయనిధి స్టాలిన్, సనాతన ధర్మాన్ని నిర్మూలించాలని అనడం కోట్లాది మంది హిందువుల మనోభావాలను దెబ్బతీయడమేనని శ్రీనివాసరావు ఆరోపించారు. ఈ విషయంలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ మౌనంగా ఉండటం సిగ్గుచేటని విమర్శించారు. విద్వేషాలను రెచ్చగొడుతున్న డీఎంకే పార్టీని ఉగ్రవాద పార్టీగా పరిగణించి, దాని గుర్తింపును రద్దు చేయాలని ఎన్నికల సంఘాన్ని కోరారు. దేశంలో అన్ని కులాలకు, మతాలకు ప్రాంతాలకు సమాన గౌరవం ఇవ్వాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆయన గుర్తు చేశారు. ఈ సందర్భంగా వేల్పురి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. రాజకీయ ప్రయోజనాల కోసం మతపరమైన విద్వేషాలను రెచ్చగొట్టే ధోరణిని సహించేది లేదని హెచ్చరించారు. భారత రాజ్యాంగం అన్ని మతాలకు స్వేచ్ఛను కల్పించిందని, ఒక ధర్మాన్ని కించపరిచేలా మాట్లాడటం రాజ్యాంగ విరుద్ధమని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ ప్రతినిధులు ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## రెవెన్యూ సేవల్లో సమయపాలన, పారదర్శకత ఉండాలి జేసీ శౌర్యమాన్ పటేల్



అనకాపల్లి జిల్లా మే 13 : రెవెన్యూ క్లినిక్ లో వచ్చిన అర్జీలపై క్షేత్ర స్థాయిలో విచారణ చేసి సత్వరమే పరిష్కరించాలని రెవెన్యూ సేవలలో సమయపాలన, పారదర్శకత, బాధ్యతాయుత పరిపాలనను కట్టుదిట్టం చేయాలని జాయింట్ కలెక్టర్ శౌర్యమాన్ పటేల్ డి.ఆర్వో ,ఆర్డీఓలు, తహసీల్దార్లను ఆదేశించారు. బుధవారం కలక్టరేట్ సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ రెవెన్యూ, సర్వే భూమి రికార్డులు, పౌర సరఫరాల శాఖల పై మండల, డివిజన్ ల వారిగా మరియు గ్రామ వార్డు సచివాలయల సర్వీస్ లు, రెవెన్యూ క్లినిక్, పి జి ఆర్ ఎస్ లలో వచ్చిన అర్జీల పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ సంబంధిత అధికారులు ప్రతి రోజు క్షేత్ర స్థాయిలో మానిటరింగ్ చేసి, రెవెన్యూ సేవలలో ఆలస్యం లేకుండా ప్రజలకు త్వరితగతిన సేవలు అందించాలన్నారు. ప్రభుత్వ భూములను పరిరక్షిస్తూ, ఆక్రమణలను నివారించేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో వివాదరహిత భూ రికార్డులు, బాధ్యతాయుత రెవెన్యూ పరిపాలన కోసం అధికారులు మరింత చురుకుగా పనిచేయాలన్నారు. ఆన్లైన్ సేవలు, భూ వ్యాపింగ్, రికార్డులు అప్డేషన్, మ్యుటేషన్ దరఖాస్తులు వంటి సమస్యలపై కార్యాచరణ ప్రణాళిక తయారుచేసుకొని పరిష్కరించాలన్నారు. లోపాలు ఉన్న చోట వెంటనే సరిదిద్దాలని, నిర్ణీత సమయంలో నివేదికలు సమర్పించాలన్నారు. పిజిఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్ లలో ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే విచారణ చేయాలన్నారు. సమావేశంలో డి.ఆర్వో సుబ్బలక్ష్మి, ప్రత్యేక డిప్యుటీ కలెక్టర్లు కె.మనోరమ, అనిత, అనకాపల్లి, నర్సీపట్నం ఆర్డీఓలు షేక్ అయిషా, వి వి రమణ, ఎడి సర్వే గోపాలరాజా, జిల్లా పౌర సరఫరాల అధికారి మరియు పౌర సరఫరాల సంస్థ డి.ఎం. లు కె.ఎన్.మూర్తి, కె జయంతి, అన్ని మండలాల తహసీల్దార్లు, సర్వేయర్లు, కలక్టరేట్ మేజిస్ట్రియల్, కో ఆర్డినేషన్, భూ వ్యవహారాల పర్యవేక్షకులు, తదితరులు పాల్గొన్నారు.

## పేరుకు పోయిన వ్యర్థాలను వెంటనే తొలగించాలి జిల్లా కలెక్టరు విజయ క్రిష్ణన్



అనకాపల్లి జిల్లా మే 13 : జిల్లాలోని అన్ని మండలాలు, గ్రామ పంచాయతీలలో పేరుకుపోయిన వ్యర్థాలను వెంటనే పూర్తిగా తొలగించి పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టరు విజయ క్రిష్ణన్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం కలెక్టరేట్ సమావేశ మందిరంలో డిప్యూటీ ఎంపీడీఓ లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడా కూడా వ్యర్థాలు లేకుండా సమగ్ర కార్యాచరణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మండలాలు, గ్రామ పంచాయతీలలో వ్యర్థాలను గుర్తింపు, విభజన, శుద్ధి, మరియు శాశ్వత పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. అవసరమైన యంత్రాలు, సిబ్బంది, నిధులను సమకూర్చి కొని పనులను పురమాయించి వేగవంతం చేయాలని ఆదేశించారు.ప్రతి మండలంలో గార్బేజ్ ట్రాన్సిట్ స్టేషన్లు ఏర్పాటు చేసి, చెత్త సేకరణ రవాణా వంటి వ్యవస్థను మరింత సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. అన్ని వీధి దీపాలు సక్రమంగా వెలిగేలా చూసుకోవాలని, ఎక్కడా లోపాలు లేకుండా మరమ్మత్తులు ఉంటే తక్షణమే మరమ్మతులు చేయాలని సూచించారు. ప్రతి ఇంటిలో సొంత మరుగుదొడ్లు ఉండేలా మరియు వాటిని వినియోగించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామ పంచాయతీల్లో ఇంటి పన్ను వసూళ్లను మరింత మెరుగుపరచాలని , పన్నుల వసూళ్లలో నిర్లక్ష్యం ఉండకుండా లక్ష్యాలను చేరుకుని జిల్లాను రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలపాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి సందీప్, డి ఎల్ డి ఓ, డిప్యూటీ ఎం పి డి ఓ లు, తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు కలెక్టర్ విజయ క్రిష్ణన్



అనకాపల్లి జిల్లా మే 13 : మే 21 నుండి జూన్ 04 తేదీ వరకు జిల్లాలో జరగనున్న ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను సమర్ధవంతం గా నిర్వహించాలని జిల్లా కలెక్టరు విజయ క్రిష్ణన్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో పోలీస్, విద్యుత్, వైద్య , విద్య , రవాణా తదితర అధికారులతో పరీక్షల నిర్వహణ పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ఈనెల 21వ తేదీ నుండి జూన్ 4వ, తేదీ వరకు ఉదయం, సాయంత్రం 25 పరీక్షా కేంద్రాలలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పరీక్షల కేంద్రంలోకి హాల్ టిక్కెట్లు ఒరిజినల్ ఐడి ప్రూఫ్ తప్ప మొబైల్ ఫోన్లు, కాలిక్యులేటర్లు, ఐప్యాడ్ , బ్లూటూత్, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతింపబోమని అన్నారు . టాయిలెట్లు, వైద్య విద్యుత్, త్రాగు నీరు తదితర మౌలిక సదుపాయాలు పరిశీలన చేసుకోవాలన్నారు. మెడికల్ క్యాంపును ఏర్పాటుచేసి మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని జిల్లా వైద్య అధికారిని ఆదేశిస్తూ సంబంధిత అధికారులను పరీక్షలు పారదర్శకంగా, జరిగేలా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా సజావుగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రాల వద్ద తగిన భద్రతా ఏర్పాట్లు చేయడంతో పాటు, త్రాగునీరు, విద్యుత్, వైద్య సదుపాయాలు, శానిటేషన్ వంటి మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉంచాలని సూచించారు.పరీక్షల సమయంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రవాణా సౌకర్యాలు సమకూర్చాలని, ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు ఆదేశించారు. అలాగే, ప్రశ్నాపత్రాల రవాణా భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఈ సమావేశంలో విద్యాశాఖ, పోలీసు, ఆరోగ్య శాఖ, విద్యుత్ శాఖ రవాణా ఇతర సంబంధిత విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## క్రీడలు విద్యార్థుల మానసిక వికాసానికి తోడ్పడతాయి జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్

- కలెక్టరేట్‌లో సమ్మర్ క్యాంప్ ప్రత్యేక శిక్షణ కార్యక్రమం
- బయ్యవరం సెయింట్ జోసెఫ్ స్కూల్‌కు సంబంధించిన క్రీడా సామాగ్రి కిట్స్‌ను విద్యార్థులకు జిల్లా కలెక్టర్ పంపిణీ
- వేసవి సెలవులను సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులు క్రీడలు, వ్యాయామం, సృజనాత్మక కార్యక్రమాల్లో పాల్గొనాలి



అనకాపల్లి జిల్లా మే 13: విద్యార్థుల శారీరక, మానసిక వికాసానికి క్రీడలు ఎంతో దోహదపడతాయని జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్ పేర్కొన్నారు. బుధవారం ఉదయం అనకాపల్లి కలెక్టరేట్‌లో సమ్మర్ క్యాంప్ ప్రత్యేక శిక్షణ కార్యక్రమం సందర్భంగా కశింకోట మండలం బయ్యవరం సెయింట్ జోసెఫ్ స్కూల్‌కు సంబంధించిన క్రీడా సామాగ్రి కిట్స్‌ను విద్యార్థులకు జిల్లా కలెక్టర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, వేసవి సెలవులను సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులు క్రీడలు, వ్యాయామం, సృజనాత్మక కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. మే 1 నుండి మే 30, 2026 వరకు నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్‌లను విద్యార్థులు పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని ఆకాంక్షించారు. విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తి పెంపొందించేందుకు కృషి చేస్తున్న సంబంధిత గేమ్స్ కోచ్‌ను జిల్లా కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి పి.శైలజ, కోచ్ సిహెచ్ సూరి అప్పారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆర్ఆర్‌టీఎస్.. మెట్రో రైలా?

హైదరాబాద్: ర్యాపిడ్ రైల్ ట్రాన్సిట్ సిస్టమ్ (ఆర్ఆర్‌టీఎస్).. మెట్రో రెండో దశకు ప్రభుత్వం సన్నద్ధమవుతున్న ప్రస్తుత తరుణంలో అనూహ్యంగా తెరపైకి వచ్చింది. తక్కువ నిర్మాణ వ్యయంతో వేగవంతమైన రవాణా సదుపాయాన్ని అందజేసే ఆర్ఆర్‌టీఎస్ ప్రాజెక్టును హైదరాబాద్‌లో చేపట్టాలని కేంద్రం ప్రతిపాదించింది. ప్రస్తుతం నగరంలో నడుస్తున్న మెట్రో కంటే ఆర్ఆర్‌టీఎస్ ఎక్కువ వేగంతో పరుగులు తీస్తోంది. ప్రయాణికులకు హైస్పీడ్ రైల్ అనుభూతిని అందజేస్తుందని కేంద్ర పట్టణాభివృద్ధిమంత్రిత్వ శాఖ రాష్ట్ర ప్రభుత్వానికి సూచించినట్లు తెలిసింది. మెట్రో రెండోదశ నిర్మాణంలో భాగంగానే ప్రభుత్వం మొదటి దశ ప్రాజెక్టును ఎల్అండ్‌టీ నుంచి కొనుగోలు చేసింది. కానీ.. ప్రస్తుత మెట్రో కంటే ఢిల్లీ నుంచి మీరట్‌కు కొత్తగా అందుబాటులోకి వచ్చిన ఆర్ఆర్‌టీఎస్ తరహాలో హైదరాబాద్‌లో నిర్మించాలని పేర్కొనడం గమనార్హం. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించి కేంద్రం అనుమతి కోసం పంపించిన రెండో దశ డీపీఆర్‌లకు అనుమతి లభిస్తుందా లేక, ఆర్ఆర్‌టీఎస్‌కే కేంద్రం కట్టుబడి ఉంటుందా అనేది చర్చనీయాంశంగా మారింది.

### మెట్రో రెండో దశకు భారీ వ్యయం..

రెండో దశలో మొత్తం 8 కారిడార్‌లలో మెట్రో విస్తరణకు ప్రభుత్వం ప్రణాళికలను రూపొందించింది. నాగోల్ నుంచి ఎయిర్‌పోర్ట్,(36,8 కి.మీ.) రాయదుర్గం నుంచి కోకాపేట్ నియోపోలిస్ (11.6 కి.మీ, ) ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట (7.5 కి.మీ.), మియాపూర్--పటాన్‌చెరు (13.4 కి.మీ.),ఎల్‌బీనగర్--హయత్‌నగర్ (7.1 కి.మీ.) చొప్పున మొత్తం 76.4 కి.మీ వరకు.. ఎయిర్‌పోర్టు నుంచి ఫ్యూచర్‌సిటీ (39.6 కి.మీ.), జేబీఎస్--మేడ్చల్ (22 కి.మీ.), జేబీఎస్-- శామీర్‌పేట్ (22కి.మీ,) కారిడార్‌లలో మరో 86.1 కి.మీ మెట్రో నిర్మాణం చేపట్టాలనేది ప్రతిపాదన.

### ప్రాజెక్టు వ్యయం మొత్తం రూ.48 వేల కోట్లు..

ఈ మొత్తం ప్రాజెక్టు వ్యయం రూ.48 వేల కోట్ల వరకు ఉంటుందని అంచనా. మొదటి దశ కొనుగోలు కోసం వెచి?ంచే సుమారు రూ.15000 కోట్ల వ్యయంతో కలిపి రూ.63000 కోట్లకు చేరనుంది. మెట్రో రెండో దశకు అవసరమైన నిధులను జైకా,ఏడీబీ వంటి అంతర్జాతీయ ఆర్థిక సంస్థల నుంచి కేవలం 2 శాతం వడ్డీకి నిధులను సేకరించాలనేది ప్రభుత్వ ప్రణాళిక. ఈ మేరకు ఇప్పటికే ప్రాథమికంగా జైకాతో ఒప్పందం కూడా ఏర్పడింది. కేవలం రూ.48000 కోట్లతో 192.2 కి.మీ వరకు ఆర్ఆర్‌టీఎస్ ప్రాజెక్టును చేపట్టవచ్చని కేంద్రం ప్రతిపాదిస్తోంది.




### నిర్మాణ వ్యయం తగ్గుతుందని..

పటాన్‌చెరు--లక్డీకాపూల్-- ఆరాంఘర్, రాయదుర్గం--కోకాపేట్, ఎల్‌బీనగర్-- హయత్‌నగర్, ఎంజీబీఎస్--చాంద్రాయణగుట్ట, ఎయిర్‌పోర్ట్--ఫ్యూచర్‌సిటీ, జేబీఎస్--మేడ్చల్, జేబీఎస్-- శామీర్‌పేట్ రూట్లలో ఆర్ఆర్‌టీఎస్ చేపట్టాలని మెట్రోరైల్ సంస్థకు కేంద్రం ప్రతిపాదనలు చేసింది. కానీ.. ప్రతిపాదిత ప్రాంతాల్లో ఫ్లై ఓవర్ల వల్ల నిర్మాణ వ్యయం భారీగా పెరిగే అవకాశం ఉంటుందని హెచ్ఎంఆర్ఎల్ పేర్కొంది. అయితే.. భూగర్భ కారిడార్‌లను నిర్మించి వ్యయాన్ని తగ్గించుకోవచ్చని కేంద్రం సూచించినట్లు సమాచారం. ఈ ప్రతిపాదనలకు భిన్నంగా మెట్రో నిర్మాణ దిశగానే రాష్ట్రం ముందుకువెళ్లే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

వేగం ఎక్కువే..

ప్రస్తుతం మెట్రో రైళ్లు గంటకు గరిష్ఠంగా 80 కి.మీ వేగంతో నడుస్తున్నాయి. ఆర్ఆర్‌టీఎస్ రైళ్లు గరిష్ఠంగా 160 కి.మీ వేగంతో పరుగులు తీస్తాయి. ఈ రైళ్లు యూరోపియన్ ట్రైన్ కంట్రోల్ సిస్టమ్ (ఈటీఎస్‌సీ) సిగ్నలింగ్ వ్యవస్థతో నడుస్తాయి. ఇది మెట్రో రైళ్లలో వినియోగించే సిగ్నలింగ్ వ్యవస్థ కంటే అత్యాధునికమైనది. ఢిల్లీ నుంచి మీరట్ వరకు 82.15 కి.మీ మార్గంలో ఆర్ఆర్‌టీఎస్ నడుస్తోంది.'నమో భారత్' పేరుతో ఈ రైళ్లను నడుపుతున్నారు.


# ఇక సొంతంగా ఆర్టీసీకి ఎలక్ట్రిక్ బస్సులు

**కనీసం 2 వేల బస్సులు సమకూర్చుకునే దిశగా ప్రభుత్వం కసరత్తు**

**ప్రస్తుతం పీఎం ఈ--డ్రైవ్ పథకం కింద అద్దె ప్రాతిపదికన 2,300 బస్సులకు ఆర్డర్**

**జనాభా దామాషా ప్రకారం సిటీలో కనీసం 5 వేల బస్సులుండాలని నిర్ణయం**

**ఆ మేరకు మిగతా బస్సులను సొంతంగా కొనే యోచనలో ప్రభుత్వం**



హైదరాబాద్: ప్రస్తుతం అద్దె ప్రాతిపదికన ఎలక్ట్రిక్ బస్సులు సమకూర్చుకుంటున్న ఆర్టీసీ, ఇక సొంతంగా కొనుగోలు చేయాలని నిర్ణయించింది. ప్రస్తుతం నగరంలో 3 వేల లోపు సంఖ్యలో మాత్రమే ఆర్టీసీ బస్సులున్నాయి. ఇవి అంతర్జాతీయ ప్రమాణాలకు ఏమాత్రం సరిపోవు. నగర జనాభా ప్రకారం దాదాపు 6 వేల బస్సులు అవసరం. ఈ నేపథ్యంలో ప్రస్తుతమున్న బస్సుల సంఖ్యను కనీసం 5 వేలకు పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం పీఎం ఈ--డ్రైవ్ కింద కేంద్ర ప్రభుత్వం నగరానికి 2,300 బస్సులు మంజూరు చేసింది. ప్రస్తుతమున్న ఎలక్ట్రిక్ బస్సులతో కలుపుకొంటే మొత్తం ఎలక్ట్రిక్ బస్సుల సంఖ్య 3 వేలకు చేరుకుంటుంది. దీంతో మరో 2 వేల బస్సులను సొంతంగా సమకూర్చుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది.

### 2030 నాటికి అందుబాటులోకి కొన్ని సొంత బస్సులు

విజన్ 2047 కోసం ఆర్టీసీ కూడా ఓ ప్రణాళికను సిద్ధం చేసుకుంది. ఇందులో 2027 నాటికి గ్రేటర్ నగరం (ఔటర్ రింగురోడ్డు లోపల)లో ఆర్టీసీకి డీజిల్ బస్సులు ఉండకూడదన్నది లక్ష్యం. అంటే వచ్చే ఏడాది నాటికి నగరంలో అన్నీ ఎలక్ట్రిక్ ఆర్టీసీ బస్సులు మాత్రమే ఉంటాయి. పీఎం ఈ--డ్రైవ్ కింద వచ్చే ఏడాది చివరి నాటికి అన్ని బస్సులు అందుతాయి. దీంతో అప్పటికి డీజిల్ బస్సులన్నింటిని ఔటర్ వెలుపలి డిపోలకు బదిలీ చేస్తారు. ఇక 2030 నాటికి జనాభా దామాషా ప్రకారం బస్సులను సమకూర్చుకోవాలన్నది రెండో లక్ష్యం. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ పథకం కింద గ్రాస్ కాస్ట్ కాంట్రాక్టు పద్ధతిలో బస్సులను సమకూర్చుకుంటుండగా, అవి జనాభా దామాషా పద్ధతిలో కావాల్సిన సంఖ్యలో ఉండవు. దీంతో అదనంగా 2 వేల బస్సులను సొంతంగా సమకూర్చుకోవాలన్నది ఆ లక్ష్యంలో భాగం. వేయి వరకు మినీ బస్సులు: ప్రస్తుతం ఎలక్ట్రిక్ బస్సులన్నీ 9 మీటర్ల కంటే పొడవైన పెద్ద బస్సులు. ఇంత పరిమాణంలో బస్సులు నగరంలోని అన్ని ప్రాంతాలకు తిరగలేవు. పాత నగరంలోని రోడ్లపై మరీ కష్టం. దీంతో ఆయా ప్రాంతాల్లో తిరిగే విధంగా మినీ ఎలక్ట్రిక్ బస్సులు సమకూర్చుకోవాలని నిర్ణయించింది. దీనికి తోడు, ఆర్టీసీ బస్సులను మెట్రో రైలు సర్వీసులతో అనుసంధానించబోతున్నారు. మెట్రో రెండు దశ కూడా రాబోతున్నందున ఫస్ట్ మైల్--లాస్ట్ మైల్ కనెక్టివిటీ ఫార్ములాను అమలులోకి తేవాలన్నది ప్రభుత్వ ఉద్దేశం. కాలనీలను మెట్రో స్టేషన్లతో అనుసంధానించాలి. అంటే కాలనీల్లో బస్సెక్కి మెట్రో స్టేషన్ వరకు వెళ్లేలా, మెట్రో రైలు దిగి బస్సెక్కి కాలనీల వరకు చేరేలా ఈ అనుసంధానం ఉంటుంది. మినీ బస్సులను ఇందుకు కూడా వాడాలన్నది ప్లాన్. వెరసి ఈ రెండు అవసరాలకు వేయి వరకు మినీ బస్సులు కొనుగోలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

### మెట్రో రైలు ప్రాజెక్టు లోన్‌తో అనుసంధానం

ఎలక్ట్రిక్ బస్సులు ఖరీదైనవి కావటంతో ఇంతకాలం ఆర్టీసీ సొంతంగా కొనటం కంటే అద్దె ప్రాతిపదికన సమకూర్చుకోవటం మెరుగైన విధానంగా భావిస్తోంది. భవిష్యత్‌లో మన దేశంలోనే ఎలక్ట్రిక్ బస్సు బ్యాటరీలు తయారు కాబోతున్నందున ఎలక్ట్రిక్ బస్సుల ధరలు కూడా తగ్గనున్నాయి. దీనికి తోడు, మెట్రో రైలు విస్తరణకు ప్రభుత్వం భారీగా రుణాలు పొందబోతోంది. మెట్రో రైలు ప్రాజెక్టులో ఆర్టీసీ బస్సులకు కూడా భాగస్వామ్యం ఉండనున్నందున, మెట్రో ప్రాజెక్టు కోసం తీసుకునే రుణంలో కొంత మొత్తాన్ని ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సుల కొనుగోలుకు కూడా వాడనున్నారు.

ఉద్యోగాలకు భరోసా...

ప్రస్తుతం జీసీసీ పద్ధతిలో నగరంలో ఎలక్ట్రిక్ బస్సులను సమకూర్చుకుంటున్నందున, డ్రైవర్లు, మెకానిక్ సిబ్బంది ప్రైవేటు సంస్థలే సమకూరుస్తాయి. కేవలం కండక్టర్లు మాత్రమే ఆర్టీసీ వైపు నుంచి ఉంటారు. ఆర్టీసీ డ్రైవర్లు, మెకానిక్ సిబ్బందిని నగరం వెలుపలికి బదిలీ చేయనున్నారు. కొంతమందిని ఇతర అవసరాలకు వాడుకోనున్నారు. దీనిపై ఆర్టీసీ కారి?మకుల నుంచి తీవ్ర నిరసన ఎదురవుతోంది. భవిష్యత్‌లో ఆర్టీసీ సొంతంగా ఎలక్ట్రిక్ బస్సులను సమకూర్చుకుంటున్నందున, వెలుపలికి వెళ్లే సిబ్బంది తిరిగి నగరానికి వస్తారన్న భరోసాను ప్రభుత్వం కల్పించే ప్రయత్నం చేస్తోంది.

## సి బి ఎస్ ఇ 12వ తరగతి ఫలితాలు విడుదల.. బాలికలదే పైచేయి



న్యూఢిల్లీ : సి బి ఎస్ ఇ 12వ తరగతి పరీక్షా ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి. పరీక్షా ఫలితాల్లో బాలురతో పోలిస్తే బాలికలు పైచేయి సాధించారు. బాలురతో పోలిస్తే బాలికలు ఫలితాల్లో 6.73శాతంతో తమ ఆధిపత్యాన్ని కొనసాగించారు. బాలికలు 88.86శాతం ఉత్తీర్ణత శాతాన్ని సాధించగా, బాలురు 82.13శాతం ఉత్తీర్ణ సాధించారు. గతేడాదితో పోలిస్తే ఉత్తీర్ణత శాతం మూడుశాతం తగ్గింది. తిరువనంతపురం 95.62శాతంతో అత్యధిక ఉత్తీర్ణత శాతాన్ని నమోదు చేయగా, ప్రయాగ్ రాజ్ 72.43శాతంతో అత్యల్ప శాతాన్ని నమోదు చేసింది. 2026 విద్యా సంవత్సరంలో మొత్తం 17,68,968మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా, ఉత్తీర్ణత శాతం 88.39శాతం నుండి 85.20శాతానికి పడిపోయింది. 1,63,000మందికి పైగా విద్యార్థులు కంపార్ట్ మెంట్ కేటగిరీలో స్థానం పొందారు. గతేడాదితో పోలిస్తే సుమారు 2శాతం పెరుగుదల నమోదైంది. 94,000మందికి పైగా విద్యార్థులు 90శాతం కంటే ఎక్కువ మార్కులు సాధించగా, 17,000మందికి పైగా విద్యార్థులు 95శాతం కంటే ఎక్కువ మార్కులు సాధించారు.

## ఎన్ టి ఎపై సుప్రీంకోర్టులో పిటిషన్




న్యూఢిల్లీ : నీట్ -యుజి పేపర్ లీక్ కావడంతో ఆ పరీక్షను నిర్వహించే నేషనల్ టెస్టింగ్ ఏజన్సీ (ఎన్ టి ఎ)పై సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఎన్ టి ఎ స్థానంలో కొత్త సంస్థను నియమించాలి లేదా పూర్తిగా పునర్నిర్మించాల్సిందిగా కేంద్రాన్ని ఆదేశించాలని కోరుతూ సుప్రీంకోర్టులో బుధవారం పిటిషన్ దాఖలైంది. ప్రశ్నాప్రతం లీకేజీ, అక్రమాల నేపథ్యంలో వైద్య విద్యకు సంబంధించి మే 3న నిర్వహించిన జాతీయ అర్హతా పరీక్ష (నీట్ -యుజి 2026)ను రద్దు చేస్తున్నట్లు ఎన్టిఎ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ పరీక్షకు సుమారు 22 లక్షలకు పైగా విద్యార్థులు హాజరయ్యారు. తిరిగి పరీక్ష నిర్వహిస్తామని ఎన్ టి ఎ ప్రకటించింది. పేపర్ లీక్ పై సిబిఐ విచారణకు ఆదేశించారు. నీట్ పరీక్ష నిర్వహణ కోసం "మరింత పటిష్టమైన, సాంకేతికంగా అభివృద్ధి చెందిన, స్వయం ప్రతిపత్తి కలిగిన సంస్థ " అవసరమని ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా మెడికల్ అసోసియేషన్ (ఫైమా) స్పష్టం చేసింది. కోర్టు నేరుగా జోక్యం చేసుకుని, పరీక్షను తిరిగి నిర్వహించడాన్ని పర్యవేక్షించేందుకు, ఇకపై ఎటువంటి లీకులు జరగకుండా చూసుకోవడానికి, సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జీ అధ్యక్షతన, సైబర్ సెక్యూరిటీ నిపుణులు, ఫోరెన్సిక్ నిపుణులతో కూడిన ఉన్నత స్థాయి పర్యవేక్షణ కమిటీని నియమించాలని పేర్కొంది. సుప్రీంకోర్టు నియమించిన మధ్యంతర పర్యవేక్షణ కమిటీ, సవరించిన పరీక్షా ప్రక్రియ భద్రతను ధృవీకరించి, నిర్ధారించే వరకు కోర్టు నియమించిన ఉన్నత స్థాయి కమిటీ పర్యవేక్షణలో నీట్ యుజి 2026 పరీక్షను తిరిగి నిర్వహించాలని ఆదేశించాలని పిటిషన్ కోరింది. సాక్ష్యాధారాలను నమోదు చేయడంలో వైఫల్యం వంటి ప్రమాదాలను నివారించేందుకు, గతంలో జరిగిన ప్రశ్నాపత్రాల లీకుల నేపథ్యంలో సూచించిన విధంగా ప్రశ్నాపత్రాలను డిజిటల్ లాక్ చేయడాన్ని, కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సిబిటి)విధానానికి మారడాన్ని తప్పనిసరి చేయాలని పిటిషన్ లో కోరారు. ఈ పిటిషన్ ను న్యాయవాది తన్వి దూబే దాఖలు చేశారు. నాలుగు రోజుల్లోగా సుప్రీంకోర్టుకు దర్యాప్తు నివేదికను సమర్పించాలని సిబిఐని ఆదేశించాలని ఫైమా కోరింది. సమాచారం లీక్ వెనుక పనిచేస్తున్న నెట్ వర్క్ ల వివరాలు, జరిగిన అరెస్టులు, అభియోగాలు ఎదుర్కొంటున్న వ్యక్తులు, ప్రాసిక్యూషన్ పురోగతి వివరాలు తప్పనిసరిగా ఉండాలని పిటిషన్ లో పేర్కొన్నారు. అక్రమాలను పారదర్శకంగా గుర్తించేందుకు వీలుగా నీట్-యుజి 2026 కేంద్రాల వారీ ఫలితాలను ఎన్ టి ఎ తక్షణమే ప్రచురించాలని పిటిషన్ లో కోరారు.

## ఇంధన కొరత.. భారీగా తగ్గిన మోదీ కాన్వాయ్




ఢిల్లీ: భారత ప్రధాని నరేంద్ర మోదీ సంచలన నిర్ణయం తీసుకున్నారు. పొదుపు చర్యల్లో భాగంగా తన కాన్వాయిలోని కార్ల సంఖ్యను భారీగా తగ్గించనున్నట్లు ప్రకటించారు. ఇక నుంచి కేవలం రెండు వాహనాల్లోనే తన కాన్వాయి ఉండనున్నట్లు తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా చమురు సంక్షోభం నెలకొన్న వేళ పెట్రోల్, డీజీల్ వాడకం తగ్గించడానికే ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు ప్రకటించారు. అదే విధంగా పలువురు కేంద్రమంత్రుల కాన్వాయిలోని వాహనాల సంఖ్య సైతం భారీగా తగ్గింది. హోంశాఖ మంత్రి అమిత్ షా కాన్వాయి మూడు వాహనాలకు తగ్గగా రక్షణ శాఖ మంత్రి కాన్వాయి 11 వాహనాల నుంచి నాలుగు వాహనాలకు తగ్గించారు. కాగా ఇటీవల దేశ ప్రజలకు పొదుపు చర్యలు చేపట్టాలని ప్రధాని పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రధాని సైతం స్వయంగా ఆ నిబంధనలను పాటిస్తున్నట్లు తెలుస్తోంది. కాగా ఇటీవల హైదరాబాద్‌లోని బహిరంగ సభలో మాట్లాడుతూ ప్రధాని దేశానికి కీలక సూచనలు చేశారు. " పశ్చిమాసియా యుద్ధ ప్రభావం భారత్‌పై తీవ్రంగా పడింది. దీంతో పెట్రోల్, డీజీల్ ధరలు తీవ్రంగా పెరిగాయి. ప్రస్తుత కష్ట సమయాల్లో ప్రజలంతా సంయమనం పాటించాలి. విదేశీ ప్రయాణాలు, దుబారా ఖర్చులు పూర్తిగా తగ్గించుకోవాలి. పెట్రోల్, డీజిల్‌ను పరిమితంగా వినియోగించాలి. ప్రజా రవాణానే అధికంగా వాడాలి ఎలక్ట్రిక్ వాహనాల వైపు మళ్లాలి" అని సూచించారు.

## మహారాష్ట్రలో కుప్పకూలిన ట్రైనీ విమానం



పుణే: మహారాష్ట్రలోని పుణే జిల్లాలో ఒక శిక్షణ విమానం కుప్పకూలింది. రెడ్ బర్డ్ ఏవియేషన్' సంస్థకు చెందిన టూ-సీటర్ శిక్షణ విమానం సాంకేతిలోపం కారణంగా కూలిపోయింది. బారామతిలోని గోజుబావి గ్రామం వద్ద బుధవారం ఈ ప్రమాదం జరిగింది. సరిగ్గా నాలుగు నెలల క్రితం ఇదే ప్రాంతంలో జరిగిన విమాన ప్రమాదంలో, అప్పటి మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ మరణించిన ఘటన జరిగిన తర్వాత ఈ సంఘటన చోటుచేసుకోవడం గమనార్హం. పుణే రూరల్ పోలీస్ ఎస్పీ సందీప్ సింగ్ గిల్ తెలిపిన వివరాల ప్రకారం, ఈ విమానంలో కేవలం ఒకే ఒక ట్రైనీ పైలట్ ఉన్నారు. విమానం తక్కువ ఎత్తులో ఎగురుతున్నప్పుడు సాంకేతిక లోపం తలెత్తిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. విమానం ఒక విద్యుత్ స్తంభాన్ని ఢీకొని నేలపై పడిపోయింది. అదృష్టవశాత్తూ ఎవరికీ ప్రాణహాని జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. కాగా ఈ ఏడాది జనవరిలో మహారాష్ట్ర మాజీ ఉపముఖ్యమంత్రి అజిత్ పవార్ ప్రయాణిస్తున్న లియర్‌జెట్ 45 వివిమానం బారామతి విమానాశ్రయం వద్ద క్రాష్ ల్యాండ్ అయింది. ఈ ఘోర ప్రమాదంలో అజిత్ పవార్‌తో పాటు మరో నలుగురు (ఒక పీఎస్ఓ, ఒక అటెండెంట్ , ఇద్దరు పైలట్లు) అక్కడికక్కడే మరణించిన ఘటన సంచలనం సృష్టించింది.

# యుద్ధం మిగిల్చిన విషాదం

## మానసిక వేదనలో చిన్నారులు

యుద్ధం ఎప్పుడూ విషాదాన్నే మిగుల్చుతుంది. కళ్లముందే సర్వస్వం కాలిపోవడం, ఆత్మీయులను కోల్పోవడం.. ఆర్థికంగానే కాదు, మానసికంగానూ చేసే గాయం అంతా ఇంతా కాదు. 'ఆపరేషన్ సింధూర్'సమయంలోనూ పాక్ జరిపిన షెల్లింగ్, కాల్పులు సరిహద్దు గ్రామాల్లో వినాశనం సృష్టించాయి. కుటుంబాలకు కుటుంబాలు సర్వం కోల్పోయాయి. ఇళ్లు విధ్వంసమై అనేక కుటుంబాలు నిరాశ్రయమయ్యాయి. 'ఆపరేషన్ సింధూర్'తరువాత.. నియంత్రణ రేఖ వెంబడి పాకిస్తాన్ వైపు నుంచి భారీ ఫిరంగులు, మోర్టార్ షెల్లింగ్ జరిగింది. నివాస ప్రాంతాలు, పాఠశాలలు, మతపరమైన కట్టడాలు, వాణిజ్య భవనాలపై షెల్లింగ్ జరిగింది. వందలాది కుటుంబాలు తమ ఇళ్లను వదిలి పారిపోయాయి. కాల్పులు జరిగి ఏడాది పూర్తయ్యింది. ఇప్పుడిప్పుడే జనజీవనం క్రమంగా సాధారణ స్థితికి వస్తున్నది. ప్రస్తుతానికి శాంతి నెలకొంది. పిల్లలు బడికి వెళ్తున్నారు. ప్రజలు తమ పొలాల్లో పనిచేస్తున్నారు. కానీ, ఆసంఘర్షణ తాలూకు గాయాలు సరిహద్దు గ్రామవాసుల జీవితాలను ఇంకా ప్రభావితం చేస్తూనే ఉన్నాయి. ఉత్తర కశ్మీర్‌లోని ఉరి, బోనియార్ నుంచి జమ్మూలోని పూంచ్, రాజౌరి వరకు సరిహద్దు ప్రాంత ప్రజలను భయం, మానసిక క్షోభ ఇంకా వెంటాడుతున్నాయి.

### ఫిరంగి శకలాలతో ఆటలు..

ఆ నాలుగు రోజుల యుద్ధం పిల్లల మనస్తత్వంపై తీవ్రమైన ప్రభావాన్ని చూపింది. వాళ్లు జోలపాటల కంటే ముందే మోర్టార్ షెల్స్ శబ్దాన్ని విన్నారు. ఒకప్పుడు బొమ్మలతో ఆడుకున్న పిల్లలు.. ఇప్పుడు మొనదేలిన లోహపు ముక్కలతో ఆడుకుంటున్నారు. షెల్లింగ్, నిరాశ్రయులవ్వడం పిల్లలను మానసిక వేదనకు గురి చేసింది. ఇప్పటికీ పెద్ద శబ్దాలు వినపడితే పిల్లలు భయపడుతున్నారు. ఐదేళ్ల అమీరా జాన్, తన ఇంటిపై పడి పేలిన ఫిరంగి గుళ్ల శకలాలను సేకరించి ఒక పెట్టె నిండా నింపింది. ఒకప్పుడు మట్టి బొమ్మలతో ఆడుకున్న చిన్నారి ఇప్పుడు యుద్ధ శకలాలను ఆటవస్తువులుగా మార్చుకుంది. రాళ్లు, మట్టితో కట్టిన వారి ఇంటిపై షెల్లింగ్ ఆనవాళు ఇంకా ఉన్నాయి. పగిలిన కిటికీలను పాలిథీన్ షీట్లతో కప్పి ఉంచారు. 'మా ఇంటి మీద షెల్లింగ్ తర్వాత నేను ఏడుస్తూ నిద్రపోలేదు. నా తోబుట్టువులు, తల్లిదండ్రులతో సురక్షిత ప్రాంతానికి పరుగెత్తా. రాత్రంతా మేం దాక్కునే ఉన్నాం'అని ఆ పీడకలను గుర్తు చేసుకుంది. యుద్ధం నాలుగు రోజుల్లో ముగిసినప్పటికీ, అమీరా లాంటి పిల్లలకు యుద్ధ జ్ఞాపకాలు ఎప్పటికీ చెరిగిపోకపోవచ్చు. పూంచ్‌లోనూ షెల్లింగ్ తీవ్ర గాయాలను మిగిల్చింది. ఒక దేవాలయం, ఒక గురుద్వారా, ఒక మదర్సా దెబ్బతిన్నాయి. ఇక్కడి అతిపెద్ద మదర్సా జియా--ఉల్--ఉలూమ్‌లో ముగ్గురు విద్యార్థు లు, ఉపాధ్యాయుడు మరణించారు.

### బంకర్లు లేవు..

షెల్లింగ్ మానసికంగానే కాదు.. ఆర్థికంగానూ తీవ్ర నష్టం కలిగించింది. ఇళ్లు దెబ్బతిన్న వారిలో చాలామంది ఇప్పటికీ తాత్కాలిక ఆశ్రయాల్లో నివసిస్తున్నారు. బాంబు దాడు ల్లో ధ్వంసమైన తమ ఇళ్లను తిరిగి నిర్మించుకోవడానికి పోరాడుతున్నారు. 'షెల్లింగ్ దాడి జరిగి సరిగ్గా ఏడాది. ఆ భయానక పరిస్థితులు మాకు ఇంకా గుర్తున్నాయి. మా ఇళ్లు ధ్వంసమైంది. వాటి పునరుద్ధరణకు ప్రభుత్వం మొదట రూ.1.30 లక్షలు, ఆ తర్వాత రూ. 2 లక్షలు ఇచ్చింది. దాంతో ఏం చేయగలం? ధ్వంసమైన ఇళ్లను తిరిగి నిర్మించుకోవడానికి ఆ పరిహారం సరిపోదు. ఇంకా కూలిన గోడల మధ్యే నివసిస్తున్నాం'అని ఉరి నివాసి తాలిబ్ హుస్సేన్ అన్నారు. సరిహద్దు గ్రామాల్లో బంకర్లు లేకపోవడం ప్రధాన సమస్యగా ఉంది. ఆపరేషన్ సిందూర్ తరువాత ఉరి ఉప--జిల్లా ఆసుపత్రి ప్రాంగణంలో ఒక బంకర్ నిర్మించారు. ఇలాంటి బంకర్లు ఇంకా చాలా ఏర్పాటు చేయాల్సి ఉంది. కాల్పులు జరిగినప్పుడల్లా నిర్మించి ఇస్తామని ప్రభుత్వం హామీ ఇస్తుంది. కానీ, ఆచరణలో లేదు. మళ్లీ ఏ క్షణమైనా కాల్పులు ప్రారంభం కావచ్చని, తమకు బంకర్లు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

### ఏ క్షణంలోనైనా పరుగెత్తడానికి సిద్ధంగా

'ఆకాశం నుంచి రాళ్లలా పడ్డ షెల్లుల శబ్దాల ప్రతిధ్వనులు పీడకలల్లా వినిపిస్తూనే ఉన్నాయి. ఇప్పటికీ, ఏ క్షణంలోనైనా పరుగెత్తడానికి సిద్ధంగా ఉండాలని రాత్రంతా బట్టలు వేసుకునే ఉంటాను'అని ఉరి తహసీల్‌లోని పరాన్‌పిల్లా గ్రామంలో 5వ తరగతి చదువుతున్న 12 ఏళ్ల ఉమైర్ యూనుస్ చెబుతున్నాడు. ఉమైర్ తోటి విద్యార్థులూ అంతే దిగ్భ్రాంతికి గురయ్యారు. భయంతో చదువుపై దృష్టి పెట్టడానికి ఇబ్బంది పడుతున్నారు. 'గతంలోలా చదివినవి గుర్తుంచుకోలేకపోతున్నాను. నా మనసు వేరే ఆలోచనలతో నిండిపోయింది'అని షెల్లింగ్ తరువాత బారాముల్లా పట్టణానికి పారిపోయి వచ్చిన సుహానా ఇలియాస్ అంటోంది. 'ఇక్కడి గ్రామీణ ప్రాంతాలతో పోలిస్తే సరిహద్దు గ్రామాల్లో విద్య ఇప్పటికే చాలా తక్కువగా ఉంది. మళ్లీ పుంజుకోకపోతే పెద్ద దెబ్బ అవుతుంది. ఈ ప్రాంతం ఇప్పటికే చాలా చూసింది. మా పిల్లల చదువు నాశనం కావడం మాకు ఇష్టం లేదు'అని పాఠశాల నిర్వాహకుడు 35 ఏళ్ల నాసిర్ సలీం చెబుతున్నారు.

### సన్నద్ధత లేదు..

షెల్లింగ్ కారణంగా గతేడాది వ్యవసాయ కార్యకలాపాలు నిలిచిపోయాయి. ఈ సీజన్‌లో తిరిగి ప్రారంభమయ్యాయి. ఈ పరిస్థితుల్లో కేవలం శాంతి మాత్రమే సరిపోదని, సన్నద్ధత ముఖ్యమని, దీర్ఘకాలిక భద్రతా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. పూంచ్, రాజౌరిలలో అత్యంత తీవ్రమైన షెల్లింగ్ జరిగింది. 'మేము రాత్రి భోజనం చేస్తుండగా పేలుళ్లు మొదలయ్యాయి. పిల్లలు ఏడుస్తున్నారు. జనం పరుగులు తీస్తున్నారు. రాత్రంతా జరిగిన ఆ షెల్లింగ్‌లో మా బంధువును కోల్పోయాం. ఉదయానికల్లా అతడు లేడు.'అని పూంచ్ నివాసి ముజఫర్ హుస్సేన్ కన్నీటి పర్యంతమయ్యారు. షెల్లింగ్ సమయంలో గాయపడిన వారిలో ఉరికి చెందిన జీనత్ కూడా ఒకరు. ఇల్లు పూర్తిగా కలిపోవడంతో ఆమె ఇంటిని వదిలి పారిపోయారు. పాక్షిక నష్టం కింద ఆమెకు రూ.1.06 లక్షలు, చికిత్స కోసం మరో లక్ష రూపాయలు అందింది. కానీ చికిత్స కోసం కేటాయించిన డబ్బు మందులకే ఖర్చయిపోయింది. ఉండటానికి గూడు లేకుండా పోయిందని దుఃఖిస్తున్నారు.

### పిల్లలను చదివించడమే లక్ష్యంగా

ఈ నాలుగు రోజుల షెల్లింగ్‌లో ఒక్క పూంచ్ జిల్లాలోనే నలుగురు పిల్లలతో సహా 16 మంది మరణించారు. మండి తహసీల్‌లో షాహిదా కౌసర్.. కాల్పుల్లో తన భర్త మహమ్మద్ అబ్రార్ మాలిక్‌ను కోల్పోయింది. ఇప్పుడు కుటుంబాన్ని పోషించడానికి నానా కష్టాలు పడుతోంది. 'ఆయన డ్రైవర్, మా కుటుంబానికి అతనొక్కడే ఆధారం. ఆ రాత్రి నాకు ఇంకా గుర్తుంది. షెల్లింగ్ మొదలైనప్పుడు వాష్‌రూమ్‌కు వెళ్లాడు. అక్కడే చనిపోయాడు. మా ఇల్లు కూడా దెబ్బతింది. ఇంటి మరమ్మతులు ఇంకా చేయించుకోలేకపోయాను. నాకు ముగ్గు రు పిల్లలు, అందరూ బడికి వెళ్తున్నారు. వాళ్లను ఉన్నత చదువులు చదివించడమే నా లక్ష్యం'అని కౌసర్ చెబుతోంది.

# నేటి అమ్మ మేటి యోధ

వయసు ముప్పై వచ్చేసరికి ఆమె భార్య, తల్లి, కోడలు, ఉద్యోగి. యువతిగా ఉన్నప్పటికీ ఇప్పటికీ ఎంత తేడా! కుటుంబం.. సమాజం... విసిరే సవాళ్లు ఎన్ని! కాని గెలవడం ఆమెకు తెలుసు. ఆమె నేటి అమ్మ. ఈ అమ్మకు పద్మవ్యూహాలు ఛేదించడం తెలుసు.

### నాకు నేను మిగలాలి

పెళ్లి అయ్యింది. పిల్లాడు పుట్టాడు. ఉద్యోగం ఉంది. సంతోషమే. కానీ 'నేను' ఏమయ్యాను అనే ప్రశ్న ఎదురుగా వచ్చి నిలబడుతుంది. అద్దంలో చూసుకుంటే కనిపించేది ఒకరి భార్య, ఒకరి తల్లి, ఒక కంపెనీ ఉద్యోగి. కానీ వీళ్ల వెనుక ఉత్సాహం ఉరకలెత్తే 'అమ్మాయి' కూడా ఉండాలే. నాటి అమ్మాయిని కాపాడుకోవడం నేటి అమ్మకు తెలుసు. అందుకు తను ఏం చేస్తోంది? తనకంటూ కొంత సమయాన్ని మిగుల్చుకుంటోంది. తనకు ఆసక్తి ఉన్న రాజకీయ, సామాజిక అంశాలు తెలుసుకుంటోంది. వాలెంటరీ గ్రూప్‌తో పని చేస్తోంది. నెలకి ఒక్కసారైనా ఫ్రెండ్స్‌ను కలుస్తుంది. పూర్వపు బృందానికి లంకెలా పని చేస్తోంది. నేటి అమ్మ ఏకకాలంలో అమ్మ, వ్యక్తి కూడా.

### 80శాతం తృప్తి చాలు

ఆఫీసులో ప్రమోషన్ కోసం మీటింగ్ నడుస్తోంది. ఇంట్లో పిల్లాడికి జ్వరం వచ్చింది. అటు వైపు చూడాలా.. ఇటు వైపు చూడాలా? 30 ఏళ్ల అమ్మ రెండుగా చీలిపోతుంది. ఉద్యోగం వదిలేస్తే ఆర్థిక స్వాతంత్ర్యం పోతుంది. పిల్లాడిని వదిలేస్తే మనసు ముల్లు గుచ్చుకుంటుంది. అందుకే రెండూ బేలెన్స్ చేసుకుంటోంది. 'గిల్ట్'ని పక్కన పెట్టడం నేర్చుకుంటోంది. ఆఫీసులో 100 శాతం, ఇంట్లో 100 శాతం ఇవ్వలేనని ఒప్పుకుని, రెండు చోట్లా 80 శాతం నిజాయితీగా ఇస్తోంది. 'సూపర్ ఉమన్' కాకపోయినా 'తృప్తి ఉన్న అమ్మ' అవుతోంది.

### నా శరీరం నా కవచం

డెలివరీ తర్వాత పొట్ట మీద గీతలు, జుట్టు రాలడం, నడుం నొప్పి, నిద్రలేమి. 20 ఏళ్ల వయసులోని చురుకుదనం 30కి వచ్చేసరికి మాయం. సోషల్ మీడియాలో 'ఫిట్ మామ్'లను చూసి తనను తాను తిట్టుకోవాలా? నో. నేటి అమ్మ అలా చేయదు. అద్దంలో కనిపించే గీతల్ని 'యుద్ధ గాయాలు'గా చూస్తోంది. వాటిని అలా ఉండనిచ్చి పిల్లాడిని స్కూల్‌లో దింపి వచ్చేటప్పుడు 30 నిమిషాలు నడుస్తోంది. యూట్యూబ్ చూసి 10 నిమిషాల యోగా చేస్తోంది. 'సైజ్ జీరో' కాదు, 'జీరో టెన్షన్ హెల్త్' తన టార్గెట్ చేసుకుంది. శరీరాన్ని ద్వేషించడం మానేసి, అక్కున చేర్చుకోవడం మొదలుపెట్టింది. నేటి అమ్మ... జీవన ప్రయాణాన్ని గౌరవిస్తోంది.



### నేను ముద్దాయిని కాను

పిల్లాడు మార్కులు తక్కువ తెచ్చుకున్నాడా... 'అమ్మ సరిగా చూడట్లేదు'. పిల్లాడు అల్లరి చేశాడా... 'తల్లి ఉద్యోగం చేస్తే పిల్లలు ఇలాగే ఉంటారు'. బయటి వాళ్ల మాటలు సరే... సొంత వాళ్లే 'మా అమ్మలా నువ్వు లేవు' అని పోలుస్తారు. 30 ఏళ్ల అమ్మ ప్రతి రోజూ బోనులో నిలబడుతుంది. అయితే ముద్దాయిలా కాదు. నిర్దోషిగా. పరాయి మాటలకు చెవులు మూసుకోవడం నేర్చుకుంటోంది. 'నా పిల్లాడికి ఏం కావాలో నాకు తెలుసు' అనే నమ్మకాన్ని గట్టిగా పట్టుకుంటోంది. ఫోన్ పక్కన పెట్టి పిల్లాడితో రోజూ 30 నిమిషాలు మాట్లాడుతోంది. మార్కులతో పాటు వాడితో అనుబంధం ముఖ్యమని చెబుతోంది. జడ్జిమెంట్ ఇచ్చేవాళ్లకు తన పిల్లాడి నవ్వే సమాధానం అని ప్రూవ్ చేస్తోంది.

### నా రేపటి చూపు

పిల్లాడి స్కూల్ ఫీజు, ఇంటి ఇ.ఎం.ఐ, అత్తమామల మందులు... సంపాదనలో సగం కళ్ల ముందే కరిగిపోతుంది. ఫ్రెండ్ మంచి చీర కొనుక్కుంటే 'నేను ఎప్పుడు కొనుక్కోవాలి' అని 30 ఏళ్ల అమ్మ మనసు చిన్నబోతుంది. తన కలల్ని 'తర్వాత' అనే అరలో దాచేస్తుంది. అయితే ఎన్నాళ్లు? అందుకే అమ్మ మారింది. 'తర్వాత'ని 'ఇప్పుడే'గా మార్చుకుంటోంది. నెలకి కొన్ని డబ్బులైనా తన పేరు మీద సేవ్ చేస్తోంది. ఫ్రీలాన్స్ పని చేస్తోంది. ఆన్‌లైన్‌లో చీరలు అమ్ముతోంది. భర్తతో బడ్జెట్ డిస్కస్ చేస్తోంది. 'కుటుంబం కోసం' అనే మాటతో పాటు 'నా కోసం' అనే 'అర'ను జత చేసుకుంటోంది.

### నా టాలెంట్ నా కల

పెళ్లికి ముందు ఆమెకు ఒక కల ఉండేది. డ్యాన్సర్ అవ్వాలి, లేదా బిజినెస్ పెట్టాలి, లేదా ఒక్కతే లడాఖ్ వెళ్లాలి. పిల్లాడు పుట్టాక ఆ కలల ఫైల్ మూసేసింది. 'ఇప్పుడు కుదరదులే' అని తనకు తానే సర్ది చెప్పుకుంది. మరి ఇప్పుడు? తన కలలను తవ్వి బయటకు తీస్తోంది. ఉద్యోగం, పిల్లాడితో సమయం... పోగా మిగిలిన కాసేపు తన కల కోసం కేటాయిస్తోంది. ఆన్ లైన్ క్లాస్‌లో డ్యాన్స్ నేర్చుకుంటోంది. కథలు రాస్తోంది. ఇంటి నుంచే చిన్న బిజినెస్ స్టార్ట్ చేస్తోంది. భర్తతో 'నాకూ ఒక లడాఖ్ కావాలి' అని ధైర్యంగా అడుగగలుగుతోంది. 'అమ్మ' అయిన తర్వాత కలలు చావవు, విరామంతో మేల్కొంటాయి అంతే అని ప్రపంచానికి చెబుతోంది. మరి నేటి అమ్మ కదా.

### అమ్మా... మము కన్నందుకు పాదాభివందనం

దేవుడు అన్ని చోట్లా ఉండలేక అమ్మను సృష్టించాడట. తప్పు. అమ్మతో సాటి రాగల దేవుడు ఉన్నాడంటే ఆ దేవుడు కూడా అంగీకరించడు. అందుకే కవి అంటాడు... 'అమ్మ లేకుంటే జననం లేదు, అమ్మ లేకుండా గమనం లేదు'. అవును. అమ్మ లేకుండా చేసేది ఏమి గమనం' అమ్మ లేకుండా సాగేది ఏమి గమ్యం? అమ్మా... ఎలా సాకావు మమ్మల్ని. 'అకలి' అని నువ్వు ఏనాడూ అనలేదు. మా కడుపు నిండితే నీ కడుపు నిండిందనుకున్నావు. 'స్వార్థం' అనే భావన ఏనాడూ చూపలేదు. నీకున్నదంతా మాకే పంచి పెట్టావు. అలసిన సంగతి తెలియనిచ్చావా? తెచ్చిపెట్టుకున్న హుషారుతో మమ్మల్ని విజయాల వైపు పరుగులెత్తించావు. మేము పాసైతే నువ్వు పాసయ్యావనుకుని, మేము ఇంటర్వ్యూకెళితే నువ్వు ఉపవాసం ఉండి, మేము గెలిస్తే నీకు ప్రైజ్ వచ్చిందనుకుని మురిసిపోయే అమాయకురాలివి. ఎంత క్షమ నీకు. ఎంత ఆర్తి. ఎంత ఆర్ద్రత నీ పిల్లల కోసం. నీ ప్రతి ప్రార్థన మా కోసమే కదా. 'మదర్స్ డే' అని చెప్పి స్టేటస్ పెట్టి, నీతో సెల్ఫీ దిగి ఇన్ స్టాలో పోస్ట్ చేస్తే బాధ్యత తీరిపోతుందనుకుంటున్నాం. నువ్వనే ఒక మహాకావ్యంలో మేమొక అధ్యాయమని తెలుసుకోవాలి. తెలుసుకుంటాం. కృతజ్ఞతాశ్రువులతో నీ చేతులను ముద్దాడతాం. 'అమ్మా.. మము కన్నందుకు పాదాభివందనం' అని నీ పాదాలు అంటి ఆశీర్వాదం తీసుకుంటాం.


# అమ్మ అంటే.. అంతులేని బలం


ఫ్రెండ్స్, ఈరోజు మదర్స్ డే కదా. మరి అమ్మకు ఏం గిఫ్ట్ ఇస్తున్నారు? నిజానికి అమ్మకు అసలు సిసలు గిఫ్ట్ ఏమిటో తెలుసా? ఆమె చెప్పిన మాటను పాటించడం. అలా పాటిస్తే... మీకు మంచి ఫ్యూచర్ ఉంటుంది. ఎంతోమంది గొప్ప వ్యక్తులు అమ్మ మాటను విజయానికి బాటగా చేసుకున్నారు. 'అమ్మ నా వెనుక ఉంది' అనుకుంటే వారికి ఎంతో బలంగా ఉండేది. 'అమ్మ నాతో ఉంది' అనుకుంటే ఎంతో సందడిగా, సంతోషంగా ఉండేది. 'అమ్మ ఆశీర్వచనం ఉంది' అని గుర్తు తెచ్చుకుంటే ఆత్మవిశ్వాసం పెరిగేది. విజయం చేరువయ్యేది. ఎందరో మహానుభావులు... అందరికి వెనుక అమ్మ ఉంది...

### నా ప్రపంచం అమ్మకు మాత్రమే తెలుసు!

ప్రఖ్యాత శ?రస్తవేత్త, మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలామ్ 'వింగ్స్ ఆఫ్ ఫైర్' పుస్తకంలో తన తల్లి గురించి ఇలా కవితాత్మకంగా రాశారు...

'నాకు పదేళ్ల వయసున్న ఆరోజు ఇంకా గుర్తుంది
అన్నదమ్ములు, అక్కచెల్లెళ్లు అసూయపడేలా....
నీ ఒడిలో నిద్రిస్తున్నప్పటి సంగతి. అది ?పౌర్ణమి రాత్రి.
నా ప్రపంచం నీకు మాత్రమే తెలుసు అమ్మా... నా అమ్మా!
అర్ధరాత్రి, నా మోకాళ్లపై కన్నీళ్లు జారుతుండగా... నేను మేల్కొన్నప్పుడు...
నీ బిడ్డ బాధ నీకు తెలుసు, నా అమ్మా
నీ శ్రద్ధగల హస్తాలు నా బాధను సున్నితంగా తుడిచివేశాయి
నీ ప్రేమ, విశ్వాసం, శ్రద్ధ నాకు బలాన్ని ఇచ్చాయి.




### అమ్మకు ఇచ్చిన మాట

గాంధీజీ లా చదవడం కోసం ఇంగ్లాండ్‌కు ఓడలో ప్రయాణిస్తున్నప్పుడు తోటి ప్రయాణికుడైన ఆంగ్లేయుడు పరిచయం అయ్యాడు. కొన్ని మాటల తరువాత మాంసం ప్రస్తావన వచ్చింది.

'నేను తినను' అని చెప్పారు గాంధీజీ

'ఇంగ్లాండ్‌లో ఎంతో చలిగా ఉంటుంది. అక్కడ మాంసం లేకుండా బతకడం అసాధ్యం' అన్నాడు ఆంగ్లేయుడు.

'అక్కడి ప్రజలు మాంసం లేకుండా కూడా జీవించగలరని విన్నాను' అన్నారు గాంధీజీ.

'పచ్చి అబద్ధం. మాంసం తినకుండా అక్కడ జీవించడం అసాధ్యం. అది లేకుండా మీరు జీవించలేరు' అన్నాడు ఆంగ్లేయుడు.

'మీ సలహాకు థ్యాంక్స్. కాని నేను మా అమ్మకు మాంసం తినను అని మాట ఇచ్చాను. ఒకవేళ అది లేకుండా జీవించడం అసాధ్యం అని తేలితే నేను భారతదేశానికి తిరిగి వెళ్లడానికి ఇష్టపడతాను' అన్నారు గాంధీజీ.

### తియ్యటి ఆ పిలుపు ఎప్పుడూ గుర్తుంటుంది!

సచిన్ తెందూల్కర్ తల్లి పేరు...రజని.

'ఆమె ప్రోత్సాహం, ప్రార్థనలు నాకు వెన్నుదన్నుగా ఉన్నాయి. అమ్మ నా బలం' అనేవారు సచిన్.

### చిన్నప్పుడు సచిన్ క్రికెట్ ఆడుతున్నప్పుడు...

'సచిన్... సచిన్'అంటూ పిలిచేవారు రజని.

'సచిన్... సచిన్ అనే అమ్మ పిలుపు తీయగా ఉంటుంది. అది ఎప్పుడూ గుర్తుండిపోతుంది' అంటారు సచిన్.

'ప్రతి తల్లి తన బిడ్డ ఎంచుకున్న రంగంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలనే కోరుకుంటుంది. సచిన్ విషయంలో నేను కూడా అంతే' అనేవారు రజని.

## మన జెన్-జెడ్ మంత్రులను జైలుకు పంపలేరా? : కేజ్రీవాల్



న్యూఢిల్లీ : పేపర్ లీక్ అయి నీట్ - యుజి 2026 పరీక్షను ఎన్‌టిఎ మంగళవారం రద్దు చేసింది. దీంతో విద్యార్థులు ఆందోళనకు దిగారు. విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడుకుంటున్న మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా వీధుల్లోకి వచ్చి నిరసన చేయాలని ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ బుధవారం జెన్ జెడ్ (నీట్ విద్యార్థులకు) కు పిలుపునిచ్చారు. నేడు కేజ్రీవాల్ మీడియాతో మాట్లాడుతూ.. 2014 నుంచి 93సార్లు పరీక్షా పత్రాలు లీక్ అయ్యాయి. దీనివల్ల ఆరుకోట్ల మంది యువత నష్టపోయారు. అత్యధికంగా పేపర్ లీక్ ఘటనలు బిజెపి పాలిత రాష్ట్రాలైన రాజస్థాన్, యుపి, ఉత్తరాఖండ్, గుజరాత్‌లలో జరిగాయి. తాజాగా జరిగి నీట్ పేపర్ లీక్ రాజస్థాన్ కేంద్ర బిందువుగా ఉందని మాకు నివేదికలు అందుతున్నాయి. వీటినిబట్టి మాకు అనేక రకాల అనుమానాలు తలెత్తుతున్నాయి. ఈ ఘటనలో బిజెపి నేతల ప్రమేయం ఉందా? ఒకవేళ అదే నిజమైతే సిబిఐ ఏం చేయగలదు? అని ఆయన ఈ సందర్భంగా జెన్‌జెడ్‌ని ప్రశ్నించారు. నేపాల్, బంగ్లాదేశ్‌లలో జరిగిన జెన్-జెడ్ నిరసనల వల్ల కెపి ఓలి, షేక్ హసీనా ప్రభుత్వాలు కూలిపోయాయి. నేపాల్, బంగ్లాదేశ్ జెన్‌జెడ్ రోడ్లపైకి వచ్చి తమ ప్రభుత్వాలను మార్చగలిగినప్పుడు పేపర్ లీక్ ఘటనలలో ప్రమేయం ఉన్న మంత్రులను మన జెన్-జెడ్ జైలుకు పంపలేరా? నాకు మీపై పూర్తి నమ్మకం ఉంది అని కేజ్రీవాల్ అన్నారు. పేపర్ లీక్‌లలో ప్రమేయం ఉన్నవారికి వ్యతిరేకంగా వీధుల్లోకి రావాలని కేజ్రీవాల్ జెన్ జెడ్‌కు పిలుపునిచ్చారు. ఇందులో ప్రమేయం ఉన్నవారిని నిందించండి. వారిని జైలుకు పంపండి. మీరు వీధుల్లోకి వచ్చి నిరసన తెలిపి ఈ నీచమైన ఆటను అరికట్టండి అని కేజ్రీవాల్ అన్నారు.ం

## స్వల్ప లాభాల్లో ముగిసిన మార్కెట్లు - మళ్లీ రూపాయి పతనం



ముంబయి : దేశీయ షేర్ మార్కెట్లు తీవ్ర హెచ్చుతగ్గుల మధ్య స్వల్ప లాభాలతో ముగిశాయి. బుధవారం ప్రారంభంలో నష్టాల్లోకి జారుకున్న సూచీలు.. చివరికి కొనుగోళ్ల మద్దతుతో కోలుకున్నాయి. ముఖ్యంగా లోహ, చమురు, వాయు రంగాలకు చెందిన షేర్లు మార్కెట్‌కు ఊతమిచ్చాయి. జాతీయ స్టాక్ సూచీ 24,400 మార్క్‌కు పైగా ముగియగా, విదేశీ మారకద్రవ్య విపణిలో రూపాయి విలువ మరింత బలహీనపడింది. ఒక దశలో డాలరుతో మారకం విలువ రూ.95.80 వద్దకు చేరుకుని కొత్త కనిష్ఠాన్ని నమోదు చేసింది. ముంబయి స్టాక్ సూచీ సెన్సెక్స్ గత ముగింపు 74,559.24 పాయింట్లతో పోలిస్తే 74,439.34 వద్ద నష్టాలతో ప్రారంభమైంది. రోజంతా తీవ్ర ఒడుదొడుకులకు లోనైన సూచీ.. ఇంట్రాడేలో 74,134.48 నుంచి 75,191.57 పాయింట్ల మధ్య భారీగా కదలాడింది.

### రూపాయి విలువ డాలరుతో పోలిస్తే 95.71గా నమోదు


చివరికి 49.74 పాయింట్లు పెరిగి 74,608.98 వద్ద స్థిరపడింది. మరోవైపు నిఫ్టీ 33.05 పాయింట్లు లాభపడి 23,412.60 వద్ద ముగిసింది. విదేశీ మారకద్రవ్య విపణిలో రూపాయి విలువ డాలరుతో పోలిస్తే 95.71గా నమోదైంది. సెన్సెక్స్ సూచీలో ఏషియన్ పెయింట్స్, టాటా స్టీల్, అదానీ పోర్ట్స్, బీఈఎల్, భారతీ ఎయిర్‌టెల్ కంపెనీల షేర్లు లాభాల్లో నిలిచాయి. మరోవైపు మహీంద్రా అండ్ మహీంద్రా, ఇన్ఫోసిస్, టీసీఎస్, సన్ ఫార్మా, టెక్ మహీంద్రా కంపెనీల షేర్లు నష్టపోయాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ ముడి చమురు ధర బ్యారెల్‌కు 107 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు ధర 4701 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

## ఇరాన్ పై అమెరికా యుద్ధం ఖర్చు 29 బిలియన్ డాలర్లు



వాషింగ్టన్ : ఇరాన్ పై అమెరికా యుద్ధం ఖర్చు సుమారు 29 బిలియన్ డాలర్లకు పెరిగిందని పెంటగాన్ మంగళవారం ప్రకటించింది. అమెరికా సైనిక సంసిద్ధత, దాని ప్రభావంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీవ్ర విమర్శలను ఎదుర్కొంటున్న తరుణంలో ఈ ప్రకటన వెలువడటం గమనార్హం. క్యాపిటల్ హిల్ లో జరిగిన బడ్జెట్ పరిశీలన సందర్భంగా ఈ వివరాలు వెల్లడయ్యాయి. ఈ ఖర్చు రెండు వారాల క్రితం సైనిక శాఖ ఇచ్చిన మునుపటి అంచనా కన్నా సుమారు 4 బిలియన్ డాలర్లు అధికంగా ఉంది. 1.5ట్రిలియన్ డాలర్ల 2027 రక్షణ బడ్జెట్ అభ్యర్థన గురించి అమెరికా యంత్రాంగ ప్రతినిధి హెగ్సెత్, జాయింట్ చీఫ్స్ చైర్మన్ డాన్ కెయిన్ , పెంటగాన్ ఫైనాన్స్ చీఫ్ జూల్స్ హర్స్ 111లు వివరిస్తుండగా.. యుద్ధం వ్యయం గురించి కాంగ్రెస్ ప్రశ్నించింది. అది 25 బిలియన్ డాలర్లుగా ఉంది అని హెగ్సెత్ ఏప్రిల్ 29న చేసిన అంచనాను ప్రస్తావిస్తూ హర్స్ అన్నారు. అయితే జాయింట్ స్టాఫ్ టీమ్, కంప్ట్రోలర్ టీమ్ ఆ అంచనాను నిరంతరం పరిశీలిస్తున్నాయని, పరికరాల రిపేర్లు, భర్తీ ఖర్చులు వంటి విస్తృత నిర్వహణ ఖర్చును కలిపి ఇప్పుడు అది 29 బిలియన్ డాలర్లకు దగ్గరగా ఉందని భావిస్తున్నామని అన్నారు. కాంగ్రెస్ కు పూర్తి వివరాలు ఎప్పుడు అందిస్తారని ప్రశ్నించగా.. హెగ్సెత్ సమాధానాన్ని దాటవేస్తూ.. పెంటగాన్ బడ్జెట్ నుండి తమకు అవసరమైన మొత్తాన్ని కేటాయించాల్సిందేనని అన్నారు. డెమొక్రాట్లు, యుద్ధాన్ని వ్యతిరేకిస్తున్న వారు పెంటగాన్ లెక్కలపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇరాన్ వలన కలిగిన నష్టంతో సహా యుద్ధం ఖర్చు చాలా ఎక్కువగా ఉండవచ్చని అభిప్రాయం వ్యక్తం చేశారు. యుద్ధానికి పెరుగుతున్న ఖర్చు, అమెరికా లక్ష్యాలపై పారదర్శకత లోపించిందని డెమొక్రాట్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రశ్నకు సమాధానమివ్వాలని, ఈ యుద్ధంతో ఏం సాధించాం, ఎంత మూల్యం చెల్లించామో వెల్లడించాలని డెమొక్రాట్ సభ్యులు రోసా డెలావురా నిలదీశారు.

## ఇజ్రాయిల్ సైన్యం డ్రోన్లతో కార్లపై దాడి : ఎనిమిది మృతి



లెబనాన్ : ఇజ్రాయిల్ సైన్యం లెబనాన్ పౌరుల్ని లక్ష్యంగా చేసుకుని దాడులకు పాల్పడుతోంది. బుధవారం బీరూట్ -- దక్షిణ లెబనాన్‌ని కలిపే ప్రధాన రహదారిపై వెళుతున్న కార్లపై ఇజ్రాయిల్ సైన్యం మూడుసార్లు డ్రోన్ల దాడికి పాల్పడింది. దీంతో ఇద్దరు చిన్నారులతో సహా ఎనిమిది మంది మృతి చెందారు. ఈ విషయాన్ని లెబనాన్ ఆరోగ్య మంత్రిత్వశాఖ వెల్లడించింది. లెబనాన్ రాజధాని బీరూట్‌కి దక్షిణంగా సుమారు 20 కిలోమీటర్ల (12 మైళ్ల) దూరంలో ఉన్న జియే ప్రాంతంలో ఈ ఘటన జరిగింది. ఇజ్రాయిల్ పాల్పడిన డ్రోన్ల దాడికి కార్లు ధ్వంసమయ్యాయి. ఈ బాంబు దాడికి కార్ల బాహ్యభాగాలు కాలిపోయి, ముక్కలయిపోయాయి వీటికి సంబంధించిన ఫొటోలను లెబనాన్ జాతీయ వార్తా సంస్థ వెల్లడించింది. ఈ దాడులు మరింత ఉద్రిక్తతలకు కారణమవుతాచపి ఆల్‌జజీరా ప్రతినిధి జైనా ఖోద్ర ఆందోళన వ్యక్తం చేశారు. కాగా, లెబనాన్, ఇజ్రాయిల్ బహుశా అమెరికా మధ్యవర్తిత్వంతో వాషింగ్టన్‌లో గురువారం మరో దఫా చర్చలు జరగనున్నాయి. అయితే హెజ్బుల్లా అమెరికా మధ్యవర్తిత్వంలో జరిగే చర్చలను వ్యతిరేకిస్తోంది. మరోవైపు బుధవారం ఉదయం ఇజ్రాయెల్ సైన్యం దక్షిణ లెబనాన్‌లోని మీస్ ఎల్-జబల్, యానూహ్, బుర్జ్ షెమాలి, హులా, డెబ్ల్, అబ్బాసియ్యే ఆరు గ్రామాలు నివాసితులను బలవంతంగా తమ గ్రామాలను వదిలి వెళ్లిపోవాలని హెచ్చరించింది. అక్కడి నుంచి వెళ్లకపోతే నివాసితులను బలవంతంగా తరలిస్తామని, ఆ గ్రామాల నుంచి వెయ్యి కిలోమీటర్ల దూరంలోకి వెళ్లాలని, లేకపోతే తమ ప్రాణాలను ప్రమాదంలోకి పడేసుకున్నట్లేనని ఇజ్రాయిల్ బెదిరించింది.

# కల్లోల కాలంలో శిఖరాగ్రం!




ప్రపంచం పెనుసంక్షోభంలో చిక్కుకున్న తరుణంలో ఫిలిప్పీన్స్‌లోని సెబూ నగరంలో శుక్రవారం ఆగ్నేయాసియా దేశాల సంస్థ (ఏసియాన్) శిఖరాగ్ర సదస్సు ప్రారంభం కాబోతోంది. దీనికి ముందు గురువారం ఏసియాన్ విదేశాంగ మంత్రుల సమావేశంలో పాల్గొన్న వారంతా ఈ సంక్షోభ స్థితి గురించీ, దాన్ని అధిగమించటానికి గల మార్గాల గురించీ స్థూలంగా చర్చించారు. అమెరికా అనుసరిస్తున్న వైఖరి కారణంగా పశ్చిమాసియాలో ప్రతిష్టంభన ఏర్పడి, ఇంధన సంక్షోభం చుట్టుముడుతోంది. ఈ సంస్థలోని 11 సభ్య దేశాలూ ఇంధన దిగుమతులపై ఆధారపడినవే. ఈ ప్రతిష్టంభన వల్ల ఆహార సరఫరా మార్గాలు సైతం మూసుకుపోయాయి. వీటి జనాభా మొత్తంగా 70 కోట్లు. సంక్షోభం దీర్ఘకాలం కొనసాగితే ఇంధన ధరలు ఆకాశాన్నంటడంతోపాటు ఆహార పదార్థాల, సరుకుల లభ్యత గణనీయంగా పడిపోతుందనీ, ప్రాణావసర ఔషధాలు దొరక్క జనం తీవ్ర ఇబ్బందులకు లోనవుతారనీ ఆసియాన్ దేశాలు భయాందోళనలు చెందుతున్నాయి. అర్థరహితమైన 'అమెరికా ఫస్ట్' నినాదంతో తన తొలి ఏలుబడిలోనే డోనాల్డ్ ట్రంప్ స్వీయరక్షణ చర్యలు మొదలెట్టారు. రెండోసారి దాన్ని మరింత ముమ్మరం చేయటంతో పాటు స్వపర భేదం లేకుండా అదనపు సుంకాలతో ప్రపంచ దేశాలన్నిటినీ బెంబేలెత్తించారు. దాన్ని తట్టుకోవటం ఎలాగన్న మీమాంసలో అందరూ పడిన తరుణంలో గ్రీన్ ల్యాండ్ సొంతం చేసుకుంటామనీ, కెనడాను విలీనం చేసుకుంటామనీ బెదిరింపులు ప్రారంభించారు. కెనడాలో నిరుడు ఎన్నికల తర్వాత ప్రధానిగా వచ్చిన మార్క్ కెర్నీ 'త్వరలోనే మా 51వ రాష్ట్ర గవర్నర్ అవుతారు' అంటూ ట్వీట్ చేశారు. ఇక వెనెజులా వ్యవహారం అత్యంత దారుణమైనది. ఆ దేశాధ్యక్షుడు మదురోను, ఆయన భార్యను అపహరించి తీసుకొచ్చి అమెరికాలో తప్పుడు ఆరోపణలతో కేసులు పెట్టి విచారిస్తు న్నారు. ఇక ఇరాన్‌పై 68 రోజుల క్రితం అకారణంగా యుద్ధానికి దిగారు. ఇరాన్‌కు ఒకే ఒక పేజీలో తాజా ప్రతిపాదనలు పంపామనీ, దానిపై ఆ దేశం తీసుకునే నిర్ణయం ఆధారంగా తదుపరి చర్యలుంటాయనీ

అమెరికా చెబుతోంది. ఇది కేవలం ఏసియాన్ శిఖరాగ్ర సదస్సును దృష్టిలో ఉంచుకుని, దాన్ని మభ్యపెట్టేందుకు సాగిస్తున్న కపట నాటకమా లేక చిత్తశుద్ధితో చేస్తున్న ప్రయత్నమా అనే సందేహాలు చాలామందిలో ఉన్నాయి. ఎందుకంటే ఈ తాజా ప్రతిపాదనలన్నీ ఒబామా హయాంలో 2015 జూలైలో 'ఉమ్మడి సమగ్ర కార్యాచరణ' పేరిట ఇరాన్‌తో కుదిరిన అణు ఒప్పందంలోని అంశాలకు దగ్గరగా ఉన్నాయంటున్నారు. గత ఏలుబడిలో అది పనికిమాలిన ఒప్పందమంటూ బుట్టదాఖలా చేసింది ట్రంపే. సుదీర్ఘ ప్రతిష్టంభన వల్ల ప్రపంచ దేశాలతో పాటు అమెరికా కూడా దివాలా తీస్తుందన్న భయంతో కాళ్లబేరానికొస్తే మంచిదే. ఏసియాన్ దేశాల ఉమ్మడి స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) 3,80,000 కోట్ల డాలర్లు. ఇది కాస్తా దిగజారడం మొదలైందంటే... పొదుపు చర్యల అమలు తప్పనిసరైతే ఎక్కడి కక్కడ ప్రజాగ్రహం వెల్లువెత్తి ప్రభుత్వాలు కుప్పకూలే ప్రమాదం ఏర్పడుతుంది. అందుకే చాన్నాళ్లుగా ఫిలిప్పీన్స్

ప్రాంతీయ చమురు పంపకం ప్రతిపాదన చేస్తోంది. అన్ని ఆర్థిక వ్యవస్థలూ ఒకదానితో మరొకటి పెనవేసుకుని ఉంటాయి గనుక ఇలాంటి సహకారం సంక్షోభాన్ని నివారిస్తుందన్నది ఆ ప్రతిపాదన సారాంశం. కానీ పశ్చిమాసియాలో తిరిగి ప్రశాంతత నెలకొనడం తప్ప మరేదీ పరిష్కారం కాదు. మిగిలినవన్నీ తాత్కాలిక ఉపశ మనాలే. దీర్ఘకాలం కొనసాగించటానికి పనికొచ్చేవి కాదు. అమెరికా చాటున అణిగి మణిగి ఉండే పాత రోజులు అంతరించాయనీ, గట్టిగా నిలబడి స్వరం పెంచితేనే ఏదో మేరకు ఆ దేశం దిగొస్తుందనీ ఏసియాన్ గుర్తించాలి. అదే సమయంలో ఆహారం,ఇంధనం, వాణిజ్యం అంశాల్లో ఇతర ప్రాంతీయ బృందాలతో సమన్వయం చేసుకోవాలి. వాటి సహకారం పొందాలి. తమ వంతు సాయం అందించాలి. ఏసియాన్‌తో భారత్ వాణిజ్యం సరిగా లేదు. ఆ దేశాలనుంచి వచ్చే దిగుమతులతో పోలిస్తే, అక్కడికి మన ఎగుమతులు చాలా తక్కువున్నాయి. ఈ వాణిజ్యలోటు 2023 నాటికి 4,400 కోట్ల డాలర్లుంది. ఇలాంటి లోటుపాట్లన్నిటినీ సరిచేసుకుంటేనే ఏసియాన్ అన్ని రకాల సంక్షోభాలనూ దృఢంగా ఎదుర్కొనగలుగుతుందని శుక్రవారం జరగబోయే దేశాధినేతల శిఖరాగ్ర సదస్సు గుర్తించాల్సి ఉంది.

# విజయారోహణలో ట్విస్టులు



తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో రివాజుకు భిన్నంగా ప్రధాన ద్రవిడ పార్టీలు రెండింటినీ రెండంకెలకు పరిమితం చేసి, రాజకీయ తెరపైకి విజేతగా దూసుకొచ్చిన సినీ నటుడు విజయ్‌కి గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్ రూపంలో చివరి నిమిషంలోనూ అవరోధాలు ఎదురవుతున్నాయి. ముఖ్యమంత్రిగా శనివారం ఆయన ప్రమాణస్వీకారం చేస్తారని తొలుత అనుకున్నా వీసీకే, ఐయూఎంఎల్ లేఖలు రాలేదని అంటున్నారు.దాంతో విజయ్ వరసగా మూడోరోజు గవర్నర్‌ని కలిసినా ఫలితం లేకపోయింది. సొంతంగా 108 స్థానాలు సాధించి అత్యధిక స్థానాలున్న పార్టీగా ఆవిర్భవించిన విజయ్ నేతృత్వంలోని టీవీకేకు మద్దతిస్తామని అయిదుగురు సభ్యులున్న కాంగ్రెస్ ప్రకటించగా, తాజాగా రెండేసి స్థానాలున్న సీపీఐ, సీపీఎంలు అంగీకారం తెలిపాయి. ప్రభుత్వ ఏర్పాటుకు 118 అవసరం కాగా, రెండుచోట్లనుంచి గెలిచిన విజయ్ ఎటూ ఒక స్థానం నుంచి తప్పుకోవాలి గనుక టీవీకే నికర బలం 107. రాజీనామా చేసే స్థానం తమకిస్తేనే లేఖ ఇస్తామని వీసీకే పట్టుబట్టగా, ఐయూఎంఎల్ అసలు లేఖే ఇవ్వలేదంటున్నారు. ఈ అంకెల ఆట ఎలావున్నా, ఆర్లేకర్ తీరు సంప్రదాయాలకు విరుద్ధం. ఈనెల 6న విజయ్ తొలిసారి గవర్నర్‌ను కలిసినప్పుడే ఆ వ్యవహారం ముగియాల్సి ఉండగా ఎందుకనో దీన్నింకా సాగదీస్తున్నారు. ఎస్‌ఆర్ బొమ్మై కేసులో సుప్రీంకోర్టు స్పష్టంగా 'ప్రభుత్వాల బలాబలాలు తేలాల్సింది చట్టసభల్లో తప్ప రాజ్ భవన్‌లలో కాద'ని తెలిపింది. ఉన్నవాటిలో మెజారిటీ పొందిన పక్షమేదో గమనించుకుని ఆహ్వానించటం, బల నిరూపణకు గడువీయడం తప్ప గవర్నర్‌కు మరే ప్రత్యామ్నాయమూ లేదు. అందుకు భిన్నంగా వ్యవహరించటం ఎలా చూసినా ధర్మం కాదు. ఇది అనవసర అపోహలు, అనుమానాలకు తావిచ్చింది. కేంద్రం రాష్ట్రంలో అస్థిరత కోరుకుంటున్నదనీ, రాష్ట్రపతి పాలన విధిస్తారనీ వదంతులు వ్యాపించాయి. కొన్ని గంటలపాటు డీఎంకే, ఏఐఏడీఎంకేలు కలుస్తాయన్న పుకార్లు షికార్లు చేశాయి. అలా కలిసినా ఆ పక్షాలు విజయ్ దరిదాపుల్లోకి వచ్చే అవకాశం ఉండదు. ఈ ఊహాగానాలకు తావిచ్చేలా జాప్యం చేయటం అవసరమా? బలనిరూపణలో విఫలమైతే విజయ్ సర్కారు తప్పుకోవాల్సిరావొచ్చు. దానివల్ల కలిగే కష్టనష్టాలు ఆయన చూసుకుంటారు. ఆ పరిస్థితి ఏర్పడితే టీవీకే తర్వాత స్థానంలోవున్న పార్టీని ఆహ్వానించాలి.అంతేతప్ప లోక్‌భవన్‌లో లెక్కలు వేస్తూ కూర్చోవటం సరికాదు. విజయ్ తమ లేఖతో పాటు కాంగ్రెస్ ఎమ్మెల్యేల లేఖ కూడా ఇవ్వటమే సమస్య తెచ్చిందని కొందరు వాదిస్తు న్నారు. ప్రజల మనోభీష్టం నెరవేర్చేందుకు సాంకేతికపరమైన అంశాలు అభ్యంతరం కావటం సరికాదు. పొరుగునున్న కర్ణాటకలో కొన్నేళ్లక్రితం బీజేపీకి తక్కువ స్థానాలొ చ్చినా మెజారిటీ స్థానాలున్నాయి గనుక దాన్నే ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించారు. ఆ నిర్ణయాన్నెవరూ తప్పుబట్టలేదు. సర్కారియా కమిషన్ సైతం 1988నాటి నివేదికలో ఎన్నికల ముందు ఏర్పడిన కూటములనూ, లేనట్టయితే ఉన్న పక్షాల్లో అత్యధిక స్థానాలొ చ్చిన పార్టీనీ పరిగణనలోకి తీసుకోవాలని అభిప్రాయపడింది. ఈ రెండేళ్లలో విజయ్ సాధించిన రాజకీయ అనుభవం సంగతేమోగానీ... ఈ మూడు నాలుగు రోజుల్లో ఆయనకది దండిగానే దక్కింది. ఈ మొత్తం వ్యవహారంలో కాంగ్రెస్ తీరు జుగుప్సాకరంగావుంది. జాతీయస్థాయిలో ఇండియా కూటమికి నాయ కత్వం వహిస్తూ తన భాగస్వామ్యపక్షం తమిళనాట ఓడిపోగానే చేతులు దులుపుకొని బయటకు పోవటం ఏం నీతి? అందువల్ల విజయ్‌కి వీసమెత్తు ప్రయోజనం లేకపోగా, విపక్ష కూటమికి అది చేటు తెస్తుంది. కనీసం సహ భాగస్వామ్యపక్షాలు డీఎంకే, వీసీకే, సీపీఐ, సీపీఎంలనైనా సంప్రదిస్తే మర్యాదగా ఉండేది. చివరకు సీపీఐ, సీపీఎం వచ్చి చేరాయిగానీ... రాజ్యాంగసంక్షోభా నివారణకే ఆ పనిచేశాయి. ఆ మాత్రం వేచిచూడాలన్న ఇంగితజ్ఞానం లేకపోగా, భవిష్యత్తు ఎన్నికలన్నిటికీ ఈ కొత్త పొత్తు వర్తిస్తుందని ప్రకటించి కాంగ్రెస్ మరింత చులకనైంది. ఒంటరిగా బరిలోదిగి తన సత్తాతో జనాభిమానం చూరగొని మెజారిటీ స్థానాలు పొందిన విజయ్‌కి అవకాశమీయకుండా మీనమేషాలు లెక్కించటం సరికాదు. అది అప్రజాస్వామికం. అన్ని అడ్డంకులూ తొలగి ఆయన ముఖ్య మంత్రిగా ప్రమాణస్వీకారం చేస్తారని, ప్రజాభీష్టం నెరవేరుతుందని ఆశించాలి.

# చక్రభ్రమణం



ఆశ, నిరాశ, దురాశ, అత్యాశ... ఓహ్, ఆశకెన్ని రూపాలో! అవన్నీ మనిషిలోనే ఉన్నాయి, మనిషిని శాసిస్తూనే ఉన్నాయి; మనిషి చరిత్రను కొత్త మలుపు తిప్పుతూనే ఉన్నాయి. మనిషిలోని దురాశ హఠాత్తుగా యుద్ధవిధ్వంసాలవైపు నడిపిస్తుంది; అదే మనిషిని తిరిగి నిరాశ ఆవహిస్తుంది, అందులోంచి మళ్ళీ ఆశ మొలకెత్తుతుంది. ఇలా ఆశ,నిరాశ, దురాశ, అత్యాశల చక్రం తిరుగుతూనే ఉంటుంది. తన నిరాశను, ఆశతో జయించే ప్రయత్నంలో ఆ నిరాశకు కారణమైన వ్యక్తిని కడతేర్చడం, తిరిగి అవతలి పక్షాన్ని నిరాశ లోకి నెడుతుంది. ఏ యుద్ధంలోనైనా జరిగేది అదే. ఒకరి ఆశ, ఇంకొకరికి నిరాశ! సీతను కోల్పోయి శోకంలో మునిగిన అంతటి రామునిలోనూ ఆశాభావం నింపే బాధ్యతను తమ్ముడు లక్ష్మణుడు తీసుకున్నాడు. 'ఉత్సాహమే బలం, ఉత్సాహవంతుడికి లోకంలో సాధించలేనిదేమీలే' దన్నాడు. అలా మేలుకున్న ఆశతో రాముడు సాధించిన విజయం, అవతల మండోదరితో సహా రావణుని పరివారం మొత్తాన్ని శోక, నిరాశల్లో ముంచింది. అంతిమంగా జరిగింది, శోకనైరాశ్యాలు చోటు మారడమే. కురుక్షేత్ర యుద్ధంలో జరిగిందీ అదే. అయితే, తన ఆశావిజయం ధర్మరాజు శేషజీవితాన్ని శోకమయం చేసింది తప్ప ఊరటనివ్వలేదని, అదే మహాభారతం చెబుతోంది. రెండో ప్రపంచయుద్ధం సృష్టించిన జీవనకల్లోలం మహాకవి శ్రీశ్రీని నిరాశలోకి తోసింది; 'నిజంగానే నిఖిలలోకం నిండు హర్షం వహిస్తుందా/మానవాళికి నిజంగానే మంచికాలం రహిస్తుందా/దారుణద్వేషాగ్ని పెంచే దానవత్వం నశిస్తుందా/ బానిసల సంకెళ్ళు బిగిసే పాడుకాలం లయిస్తుందా' అన్న సందేహాల సందోహంలోకి నెట్టింది; 'బతుకు వృథా, చదువు వృథా, కవిత వృథా; లేదు సుఖం, చేదువిషం జీవఫలం' అంటూ 'చేదుపాట' పాడించింది. అంతలోనే ఆశ పుంజుకుని మరో ప్రపంచ మహావిష్కారం దిశగా మరో ప్రస్థానం ప్రారంభించింది. తొమ్మిది దశాబ్దాలు కావస్తున్నా, ఆ మరోప్రస్థాన గమ్యం చూపు మేరలో లేదు. జీవఫలం చేదువిషం నింపుతూనే ఉంది; దురాశ వికటించి మనిషి ప్రపంచాన్ని యుద్ధవిలయాలవైపు నడిపిస్తూనే ఉన్నాడు. 'కాలం బందీ అయి నెత్తురోడే/ కాలం కాని ఈ కాలాల్లో కొంచెం వేచి ఉండు/ ఈ మురుగు ప్రవాహాన్ని ఇప్పుడే ఆపలేవు/ నెమ్మదిగా, నిశ్శబ్దంగా, సహనంగా/ రహస్యంగా, ధైర్యంగా, నమ్మకంగా/ మిగిలి ఉండు, వేచి ఉండు/ తప్పులను లెక్కించి లెక్కించి/ వెక్కి వెక్కి ఏడ్చి ఏమి లాభం/లే, చావులేని నూతన స్వప్నాన్ని పిలువు' (విమల) అంటూ, ఊపిరి కడంటుతున్న ఆశకు శ్వాసపోసే కవియత్నం ఇప్పటికీ నిరవధికమవుతూనే ఉంది. ఆశల కాగడా పుచ్చుకుని నైరాశ్యపు చీకటిని తరించడానికి మనిషి స్థలకాలాలకు అతీతంగా పోరాడుతూనే ఉన్నాడు. ప్రపంచవ్యాప్తంగా కవి, కథకులెందరో అక్షరాల నేలలో ఆశల సేద్యం చేస్తూనే ఉన్నారు.

ఓ.హెన్రీ 'చివరి ఆకు' కథ గుర్తుందా! ఓ దారుణ శీతర్తువులో తీవ్రంగా జబ్బుపడిన జాన్సీ అనే ఒక యువచిత్రకారిణి తన గది కిటికీ లోంచి ఓ గోడమీద పాకిన లతనే చూస్తూ, రోజురోజుకూ రాలిపోయే దాని ఆకులతో తన రోజుల్ని ముడిపెట్టుకుని ఆందోళన చెందుతుంది. చివరికి ఒక్క ఆకు మాత్రమే మిగులుతుంది. అంతలో పెద్ద గాలివాన వచ్చి వెలుస్తుంది. ఆశ్చర్యం, మరునాడు చూసేసరికి ఆకు అలాగే ఉంటుంది; దాంతో ఆమె జీవనోత్సాహాన్ని పుంజుకుంటుంది. వాస్తవంగా జరిగింది ఏమిటంటే, బెయిర్మన్ అనే ఓ వృద్ధ కళాకారుడు, జాన్సీలో జీవితాశ రగిలించే బాధ్యతను మీద వేసుకుని ఆ గోడమీద వాస్తవికత ఉట్టిపడే ఒక ఆకుబొమ్మ చిత్రిస్తాడు. ఆ ప్రయత్నంలో అతను గాలివాన ప్రభావానికి గురై జబ్బుపడి మరణించడం-- కథ తిరిగిన ఓ విషాదకరమైన మలుపు. మోడువారిన చెట్లు చిగురించడం; వసంతం వెంటే గ్రీష్మం అడుగుపెట్టడం చూపించి ఆశ, నిరాశల చక్రభ్రమణం ప్రకృతిలోనే ఉందికదా, మనిషి ఎంత అనవచ్చు. కానీ ఎన్ని రంగాలలో మనిషి ప్రకృతిపై జయకేతనం ఎగురవేయడం లేదు! ఈ చక్రభ్రమణాన్ని ఛేదించలేడా? రేపటికి వాయిదా వేయకుండా ఈ రోజే ఈ ప్రపంచాన్ని పూర్తిగా ఆశావహం చేయలేడా?!

# రకుల్ ప్రీత్ సింగ్ వేగం అక్కడా తగ్గిందే!





-స్పైడర్- రిలీజ్ ముందు వరకూ రకుల్ ప్రీత్ సింగ్ టాలీవుడ్ లో ఎంత బిజీగా ఉండేదో చెప్పాల్సిన పనిలేదు. వరుసగా స్టార్ హీరోల సినిమాలతో క్షణం తీరిక లేకుండా గడిపేది. జయాపజయాలతో సంబంధం లేకుండా అమ్మడు తెలుగు అవకాశాలు అందుకుంది. కానీ -స్పైడర్- రిలీజ్ అనంతరం సీన్ మారింది. అప్పటి నుంచి అవకాశాలు తగ్గాయి. అలాగని పూర్తిగా అవకాశాలే లేకుండా పోలేదు. ఏదో సినిమాలో ఛాన్స్ అందుకుని టచ్ లో ఉండేది. కానీ బాలీవుడ్ లో రీలాంచ్ అయిన తర్వాత మాత్రం తెలుగు సినిమాల్ని లైట్ తీసుకుంది. ఆ సమయంలో వచ్చిన టాలీవుడ్ అవకాశాలు కూడా కాదంది. కానీ అనూహ్యంగా బాలీవుడ్ అవకాశాలతో బిజీ అయింది. ఎంతలా అంటే ఊపిరి సలపనంతగా సినిమాలు చేసింది. ఇదే సమయంలో వరుసగా కోలీవుడ్ లో కూడా అవకాశాలు ఊపందుకున్నాయి. దీంతో తమిళ, హిందీ భాషల్ని బ్యాలెన్స్ చేసి కెరీర్ ని ముందుకు తీసుకెళ్లింది. దాదాపు కెరీర్ మొత్తంలో ఇప్పటి వరకూ 18 హిందీ సినిమాలు చేసింది. -యారియాన్- బాలీవుడ్ అరంగేట్రం చేసింది. అటుపై -అయ్యారీ-, - దే దే ప్యార్ దే- లో నటించింది. ఈ సినిమా అమ్మడికి బాలీవుడ్ లో మంచి బ్రేక్ ఇచ్చింది. అనంతరం -మర్జావాన్-, -షిమ్లా మిర్చి-, -సర్దార్ కా గ్రాండ్‌సన్,- అటాక్: పార్ట్ 1-, -రన్‌వే 34-, -కట్‌పుట్లీ-, -డాక్టర్ జి,- -థాంక్ గాడ్-, -ఛత్రీవాలీ-, -ఐ లవ్ యు-, -హిందుస్థానీ 2-, - మేరే హస్బెండ్ కీ బీవీ- , -దే దే ప్యార్ దే 2- లో నటించింది. అయితే బాలీవుడ్ లో రకుల్ ప్రీత్ సింగ్ వేగం బాగా తగ్గింది. ప్రస్తుతం అమ్మడి ఖాతాలో ఒకే ఒక్క ప్రాజెక్ట్ ఉంది. -పతి పత్నీ ఔర్ వో 2- లో నటిస్తోంది. ఈ సినిమా మినహా కొత్త ప్రాజెక్టులు వేటికి అమ్మడు సైన్ చేసింది లేదు. ఈ సినిమా కూడా గత ఏడాది కమిట్ అయిన చిత్రం. కొత్త ఏడాదిలో ఎలాంటి కథలు విన్నట్లు బాలీవుడ్ లో ప్రచారం కూడా జరగలేదు. దీంతో ఉత్తరాదిన రకుల్ హవా తగ్గిందా? అన్న ప్రచారం ఊపందుకుంది. అటు భర్త జాకీ భగ్నానీ కూడా ఆర్థిక సంక్షోభంలో ఉన్న సంగతి తెలిసిందే. వరుస ఫ్లాప్ లతో పూజ ఎంటర్ టైన్ మెంట్స్ నష్టాల్లో కూరుకుపోయింది. దీంతో ఉన్న ఆస్తులు కూడా అమ్మాల్సి వచ్చింది. ఈ సమయంలో రకుల్ సినిమాలు కొంత కాలం పాటు ఫ్యామిలీకి అండగా నిలిచాయి. కానీ ఇప్పుడు ఆమెకు అవకాశాలు తగ్గడం మరింత ప్రతికూల పరిస్థితులకు దారి తీసే అవకాశం ఉంది.

# సిల్వర్ గౌనులో దేవకన్యలా ఊర్వశి రౌతేలా..

కేన్స్‌లో మరోసారి తన మార్క్ చూపిన బ్యూటీ!


79వ కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ ప్రారంభోత్సవంలో ఊర్వశి రౌతేలా

భారీ సిల్వర్ గౌనులో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన నటి

పక్షి ఆకారంలో ఉన్న తల ఆభరణం ప్రధాన హైలైట్

తనదైన మాక్సిమలిస్ట్ స్టైల్‌తో మరోసారి అందరి దృష్టిని ఆకర్షించిన ఊర్వశి

వియత్నాం లేబుల్ రూపొందించిన కస్టమ్ గౌనులో మెరుపులు



ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ 79వ ఎడిషన్ అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. ఫ్రాన్స్‌లోని ఫ్రెంచ్ రివేరాలో మే 12 నుంచి 23 వరకు జరిగే ఈ వేడుకకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీ, ఫ్యాషన్ ప్రముఖులు హాజరయ్యారు. అలియా భట్, డెమీ మూర్ వంటి తారలు ప్రారంభోత్సవంలో తమ స్టైల్‌తో ఆకట్టుకోగా, బాలీవుడ్ నటి ఊర్వశి రౌతేలా తనదైన ప్రత్యేకమైన డ్రెస్సింగ్ స్టైల్‌తో రెడ్ కార్పెట్‌పై ప్రధాన ఆకర్షణగా నిలిచారు. ప్రారంభోత్సవం కోసం ఊర్వశి వియత్నాంకు చెందిన ఫ్యాషన్ లేబుల్ 'జోలీపోలీ' డిజైన్ చేసిన కస్టమ్ కౌచర్ గౌనును ఎంచుకున్నారు. లావెండర్ రంగు బేస్‌పై భారీ సిల్వర్ అలంకరణతో ఉన్న ఈ గౌను చూడగానే కట్టిపడేసింది. క్రిస్టల్స్, సీక్విన్స్, పూసలు, రాళ్ల వర్క్‌తో గౌను మొత్తం కేన్స్ లైట్ల వెలుగులో తళతళా మెరిసింది. మత్స్యకన్య ఆకారాన్ని పోలి ఉన్న ఈ గౌను ఆమె అందాన్ని రెట్టింపు చేసింది. ఈ డ్రెస్ ప్రత్యేకతల్లో కార్సెట్ తరహాలో ఉన్న బాడీస్ ఒకటి. గౌనుపై శిల్పం చెక్కినట్టుగా వెండి ఎంబ్రాయిడరీతో సున్నితమైన డిజైన్లు ఉన్నాయి. స్వీట్‌హార్ట్ నెక్లైన్‌తో పాటు భుజాల వద్ద ఉన్న అలంకరణలు డ్రెస్‌కు మరింత ఆకర్షణను తెచ్చిపెట్టాయి. పొడవైన కేప్ స్లీవ్స్, వాటికి వేలాడుతున్న క్రిస్టల్ టాసెల్స్... వెండి రెక్కలు తొడుక్కున్నట్టుగా ఆకర్షించాయి. "ఐసీ సిల్వర్" థీమ్‌కు తగ్గట్టుగానే ఊర్వశి ఆభరణాలను ధరించారు. స్టేట్‌మెంట్ చోకర్ నెక్లెస్, దానికి సరిపోయే చెవిపోగులు, బ్రేస్‌లెట్‌తో పాటు జుట్టు ముడి మధ్యలో పక్షి ఆకారంలో ఉన్న మాంగ్ టిక్కా తరహా తల ఆభరణం అందరి దృష్టినీ ఆకర్షించింది. గౌను మొత్తం ఒకే రంగులో ఉన్నప్పటికీ, ఆమె చేతిలో పట్టుకున్న రంగురంగుల రాళ్లు, అద్దాలతో పొదిగిన బాక్స్ క్లచ్ ప్రత్యేకంగా నిలిచింది. ఇక పూర్తి గ్లామ్ మేకప్‌తో ఊర్వశి మరింత ప్రకాశవంతంగా కనిపించారు. సిల్వర్ షిమ్మర్ ఐస్, నిగనిగలాడే పెదవులు, ముఖానికి ఫ్రేమ్‌లా ఉన్న హెయిర్‌స్టైల్‌తో తన లుక్‌ను పూర్తి చేశారు. మొత్తంగా తనదైన బోల్డ్, మాక్సిమలిస్ట్ రెడ్ కార్పెట్ స్టైల్‌ను ఊర్వశి మరోసారి కేన్స్‌లో ప్రదర్శించారు.

# జక్కన్న 'వారణాసి'..

## ఫస్ట్ ఇండియన్ మూవీ అవుతుందా?





దర్శకధీరుడు ఎస్ ఎస్ రాజమౌళి, టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు కాంబినేషన్ లో తెరకెక్కుతున్న వారణాసి మూవీపై రోజురోజుకూ అంచనాలు పెరుగుతున్నాయి. ఇప్పటి వరకు ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీ చరిత్రలో నెవ్వర్ బిఫోర్ అనేలా సినిమా రూపొందుతుందని తెలుస్తోంది. తాజాగా వారణాసి.. ఓ విషయంలో ఫస్ట్ ఇండియన్ మూవీగా నిలవనుందని టాక్ వినిపిస్తోంది. నిజానికి వారణాసిపై మంచి అంచనాలు నెలకొనగా.. థియేట్రికల్ రైట్స్ కు భారీ డిమాండ్ ఉన్నట్లు తెలుస్తోంది. వచ్చే ఏడాది సినిమా రిలీజ్ కానుండగా.. ఇప్పటి నుంచే పెద్ద ఎత్తున ఆఫర్స్ వస్తున్నాయని సమాచారం. ఓవర్సీస్ రైట్స్ కోసం ఒక ప్రముఖ డిస్ట్రిబ్యూషన్ సంస్థ దాదాపు రూ.160 కోట్ల ఆఫర్ ఇచ్చినట్లు సోషల్ మీడియాలో ఊహాగానాలు చక్కర్లు కొడుతున్నాయి. కాశ్రీంశీ అందులో నిజమెంతో తెలియదు కానీ.. నెట్టింట ప్రచారం మాత్రం జరుగుతోంది. ఒకవేళ ఆ డీల్ ఖరారైతే, ఓవర్సీస్ రైట్స్ రూపంలోనే అంత భారీ మొత్తాన్ని అందుకున్న తొలి భారతీయ సినిమాగా వారణాసి రికార్డు సృష్టించే అవకాశం ఉందని తెలుస్తోంది. అదే సమయంలో ఇంకా ఓవర్సీస్ రైట్స్ ఆఫర్ పై వారణాసి మేకర్స్ డిసైడ్ అవ్వలేదని వార్తలు వస్తున్నాయి. నిజానికి ఒక సినిమాపై ఆసక్తి పెరగడానికి ట్రైలర్ లేదా టీజర్ కారణమవుతుంది. కానీ వారణాసి విషయంలో మాత్రం టైటిల్ గ్లింప్స్ విడుదలతోనే భారీ చర్చ మొదలైంది. దర్శకుడు రాజమౌళి తన ప్రత్యేక శైలిలో కథ రేంజ్ తో పాటు సినిమా ప్రపంచాన్ని పరిచయం చేస్తూ గ్లింప్స్ ను రూపొందించడంతో ప్రేక్షకుల్లో ఓ రేంజ్ లో అంచనాలు నెలకొన్నాయి. ఇప్పుడు ఓవర్సీస్ భారీ ఆఫర్ కు ఆ గ్లింప్సే కారణమని చెప్పాలి. ఇక సినిమా విషయానికొస్తే.. ఫాంటసీ మైథలాజికల్ జోనర్ లో తెరకెక్కుతున్న మూవీలో మహేష్ బాబు భిన్నమైన పాత్రలో కనిపించబోతున్నారు. ముఖ్యంగా ఆయన రాముడి రూపంలో కనిపించే సన్నివేశాలు సినిమాలో కీలకంగా ఉంటాయని ప్రచారం జరుగుతోంది. ఇది మహేష్ కెరీర్ లోనే అత్యంత భారీ ప్రాజెక్ట్ అని చెప్పాలి. ఆయనతోపాటు బాలీవుడ్ స్టార్ హీరో ప్రియాంక చోప్రా కీలక పాత్ర పోషిస్తున్నారు. మందాకినిగా కనిపించనున్నారు. మాలీవుడ్ నటుడు పృథ్వీరాజ్ సుకుమార్ విలన్ కుంభ పాత్రలో నటిస్తున్నారు. ఆస్కార్ అవార్డు విన్నింగ్ మ్యూజిక్ డైరెక్టర్ కీరవాణి సంగీతం అందిస్తున్నారు. శ్రీ దుర్గా ఆర్ట్స్ బ్యానర్ పై కేఎల్ నారాయణ భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. కథ, విజువల్స్, యాక్షన్ ఎపిసోడ్స్ అన్నీ ఇంటర్నేషనల్ లెవెల్ లో ఉండేలా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. వారణాసి చిత్రాన్ని 2027 ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయాలని నిర్మాతలు టార్గెట్ పెట్టుకున్నారు. ముఖ్యంగా 120కి పైగా దేశాల్లో రిలీజ్ చేయడానికి ప్లాన్ చేస్తున్నారు.

# పక్కా ప్లానింగ్ ఉంటే ఏదైనా సాధ్యమే

తల్లయ్యాక తన ప్రాధాన్యతలు మారాయన్న కరీనా కపూర్

రోజుకు 8 గంటలు మాత్రమే పని చేస్తానని వెల్లడి

పక్కా ప్లానింగ్ తో పిల్లల బాధ్యతను మేనేజ్ చేశానన్న కరీనా

తన భర్త పిల్లలను చూసుకున్నారని వెల్లడి





బాలీవుడ్ టాప్ హీరోయిన్లు దీపికా పదుకొణె, కరీనా కపూర్ ఖాన్ తల్లయ్యాక కెరీర్‌ను, పిల్లల బాధ్యతలను ఎలా బ్యాలెన్స్ చేయాలనే విషయంపై భిన్నమైన అభిప్రాయాలను పంచుకోవడం ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చకు దారితీసింది. పని గంటల పరిమితిపై దీపికా చేసిన వ్యాఖ్యలు ఒకెత్తు అయితే, ప్లానింగ్ ఉంటే ఏదైనా సాధ్యమేనని కరీనా చెప్పడం మరో ఎత్తు.

తల్లయ్యాక తన ప్రాధాన్యతలు మారాయని, రోజుకు 8 గంటలు మాత్రమే పని చేస్తానని దీపిక స్పష్టం చేశారు. కొత్తగా తల్లయిన వారికి చిత్ర పరిశ్రమ, కుటుంబం మద్దతుగా నిలవాలని ఆమె కోరారు. అయితే, ఈ నిబంధన వల్ల భారీ ప్రాజెక్టులైన 'కల్కి 2898 ఏడీ' సీక్వెల్, ప్రభాస్-సందీప్ వంగా 'స్పిరిట్' వంటి సినిమాల నుంచి ఆమె తప్పుకోవాల్సి వచ్చిందని వార్తలు వినిపిస్తున్నాయి. దీనిపై నెటిజన్లు భిన్నంగా స్పందిస్తున్నారు. కొందరు ఆమె నిర్ణయాన్ని సమర్థిస్తుంటే, మరికొందరు సినిమా మేకింగ్‌లో ఇది ఎప్పుడూ సాధ్యం కాదని విమర్శిస్తున్నారు. మరోవైపు కరీనా స్పందిస్తూ... 'ద బకింగ్‌హామ్ మర్డర్స్' షూటింగ్ కోసం లండన్‌లో 35 రోజులు ఉండాల్సి వచ్చినప్పుడు, పక్కా ప్లానింగ్‌తో పిల్లల బాధ్యతను మేనేజ్ చేశానని చెప్పారు. తను పనిలో ఉన్నప్పుడు భర్త సైఫ్ అలీ ఖాన్ ఇంట్లో పిల్లలతో ఉండి చూసుకున్నారని, ఇద్దరూ ఒకేసారి పని కోసం బయటకు వెళ్లకూడదనే నిబంధన పెట్టుకున్నామని తెలిపారు. షూటింగ్ మధ్యలో విరామం తీసుకుని ఇండియా వచ్చి పిల్లలతో గడిపేలా చిత్ర యూనిట్ సహకరించిందని, అన్నీ ముందుగానే ప్లాన్ చేసుకుంటే ఇబ్బంది ఉండదని ఆమె అభిప్రాయపడ్డారు. మొత్తానికి, దీపికా 'పని గంటల తగ్గింపు'ను కోరుతుంటే, కరీనా మాత్రం 'పరస్పర అవగాహన, ప్లానింగ్' తో ముందుకు వెళ్లవచ్చని సూచిస్తున్నారు.

# జోరు పెంచిన నయనతార.. మరో క్రేజీ హీరోతో ఛాన్స్!





ప్రతిభతో పాటు అదృష్టం కూడా ఉంటే ఇండస్ట్రీని దశాబ్దాల పాటు ఏలేయొచ్చు అని నిరూపిస్తున్న అతి కొద్ది మంది హీరోయిన్స్ లో నయనతార ప్రథమ స్థానంలో నిలుస్తుంది. సౌత్ లేడీ సూపర్ స్టార్ గా పేరు దక్కించుకున్న ఈమె తమిళ్, మలయాళం, తెలుగు , హిందీ భాషల్లో సినిమాలు చేస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఒకవైపు హీరోయిన్ పాత్రలతో మరొకవైపు ఆధ్యాత్మిక పాత్రలతో మెరిసిన నయనతార.. అటు యాక్షన్ పెర్ఫార్మెన్స్ తో కూడా అదరగొడుతున్న విషయం తెలిసిందే. ఒకవైపు హీరోయిన్గా మరొకవైపు నిర్మాతగా కూడా అడుగులు వేస్తున్న ఈమె.. ఇప్పుడు ఏకంగా టాలీవుడ్ మొదలుకొని బాలీవుడ్ వరకు సీనియర్ స్టార్ హీరోలకు కేరాఫ్ అడ్రస్ గా మారింది. విషయంలోకి వెళ్తే .. ప్రముఖ కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ విఘ్నేష్ శివన్ ను ప్రేమించి పెళ్లి చేసుకున్న ఈమె.. సరోగసి ద్వారా ఇద్దరు మగ కవల పిల్లలకు జన్మనిచ్చింది. వివాహం తర్వాత ఈమె జోరు మరింత పెరిగిందనే చెప్పాలి. ఇందులో భాగంగానే .. 2023లో షారుక్ ఖాన్ తో కలిసి 'జవాన్' సినిమా చేసి ఊహించని పాపులారిటీ సొంతం చేసుకుంది. అటు బాలీవుడ్ లో కూడా తన మార్కెట్ ను పెంచుకుంది ఈ ముద్దుగుమ్మ. ఈ ఏడాది మెగాస్టార్ చిరంజీవితో 'మన శంకర వరప్రసాద్ గారు' సినిమా చేసి ఇండస్ట్రీ హిట్ ను తన ఖాతాలో వేసుకుంది అంతేకాదు తాను పెట్టుకున్న కండిషన్స్ అన్నింటిని కూడా పక్కన పెట్టి మరీ ఈ సినిమాను ప్రమోట్ చేసి వార్తల్లో నిలిచింది నయనతార. అయితే అలాంటి ఈమె ఇప్పుడు మరో క్రేజీ హీరో సరసన నటించే అవకాశాన్ని అందుకున్నట్లు తెలుస్తోంది. అయితే దీనిపై త్వరలో అధికారిక ప్రకటన వెలువడే అవకాశాలు ఉన్నాయి. ఆయన ఎవరో కాదు బాలీవుడ్ స్టార్ హీరో, కండల వీరుడు సల్మాన్ ఖాన్. వంశీ పైడిపల్లి దర్శకత్వంలో దిల్ రాజు నిర్మాణంలో రూపుదిద్దుకుంటున్న ఒక బడా ప్రాజెక్టులో నయనతార అవకాశం అందుకున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఇక దీనిపై త్వరలోనే అటు చిత్ర బృందం నుండి లేదా ఇటు నయనతార నుండి అధికారిక అనౌన్స్మెంట్ వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఏది ఏమైనా వయసు పెరుగుతున్నా కూడా నయనతార క్రేజ్ ఏమాత్రం తగ్గట్లేదు.. లేడీ సూపర్ స్టార్ అనే ట్యాగ్ కి తగ్గట్లుగానే స్టార్ హీరోల సినిమాలలో అవకాశాలు అందుకుంటూ దూసుకుపోతోంది. ఇక ఎంతోమందికి రోల్ మోడల్ గా నిలిచిన నయనతార ప్రతిభతో పాటు అదృష్టాన్ని కూడా మూటగట్టుకొని ఇండస్ట్రీలో స్టార్ హీరోలతో సమానంగా దూసుకుపోతూ ఉండడం విశేషం. ఇక నయనతార ప్రస్తుత సినిమాల విషయానికొస్తే.. ఒకవైపు స్టార్ హీరోల సినిమాలలో హీరోయిన్ గానే కాకుండా.. మరొకవైపు లేడీ ఓరియంటెడ్ చిత్రాలతో కూడా అలరిస్తోంది. అందులో భాగంగానే గతంలో వచ్చిన మూకుత్తి అమ్మన్ సినిమాకి సీక్వెల్ గా వస్తున్న మూకుత్తి అమ్మన్ 2లో నటిస్తోంది. ఈ చిత్రానికి ప్రముఖ స్టార్ డైరెక్టర్ సుందర్ సి దర్శకత్వం వహిస్తున్నారు. అలాగే గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో వరల్డ్ కమర్షియల్ ఎంటర్టైనర్ గా తెరకెక్కుతున్న టాక్సిక్ సినిమాలో కూడా అవకాశం అందుకుంది . కన్నడ హీరో యష్ లీడ్రోల్ పోషిస్తున్న ఈ సినిమాలో ఆయనకు సోదరి పాత్రలో యాక్షన్ పర్ఫామెన్స్ తో అదరగొట్టడానికి సిద్ధమయ్యింది నయనతార. అలాగే బాలకృష్ణ, గోపీచంద్ మలినేని కాంబినేషన్లో వస్తున్న ఎన్బికె 111 సినిమాలో హీరోయిన్గా అవకాశం అందుకుంది. ఏదిఏమైనా అటు క్యారెక్టర్ ఆర్టిస్ట్ గా ఇటు హీరోయిన్ మరొకవైపు లేడీ ఓరియంటెడ్ చిత్రాలతో కూడా అలరిస్తోంది.

NETI SHUBHODAYA Publisher, Editor and Owned by GONGURA SRINIVASA RAO, D No : 41-29/6-76, RANIGARI THOTA, KRISHNALANKA,VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520013. PRGI Reg No -"APTEL/26/A1193 .. Cell No - 9696571571 ..... Printed At SUNDAY PRINTING PRESS,"D No : 1-17-18, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006 .